గురువారం
02-03-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 249
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

గ్రీస్‌లో ఎక్స్‌ప్రెస్, కార్గో రైళ్లు ఢీ

గ్రీస్‌లో ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుంది. ఎదురెదురుగా వచ్చిన రెండు రైళ్లు ఢీకొన్నాయి. ఈ దుర్ఘటనలో 40 మంది సజీవ దహనమయ్యారు. 85 మందికి పైగా గాయపడ్డారు.

2లో

ప్రభుత్వ దమనకాండ

- మహాధర్నా భగ్నానికి కుట్ర
- నంద్యాలలో రామకృష్ణ అరెస్టు
- ఉద్రిక్తత, తోపులాటలు
- రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ నేతల అరెస్టు, గృహనిర్బంధాలు
- నేడు విజయవాడలో మహాధర్నా
- తరలిరావాలని రామకృష్ణ పిలుపు

విశాలాంధ్రబ్యూరో-కర్నూలు/నంద్యాల:
సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణను పోలీసులు అరెస్టు చేశారు. నంద్యాల పట్టణంలో ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రామకృష్ణ నంద్యాలకు వచ్చారు. సమావేశం అనంతరం ఆయన బయటకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. జగనన్న కాలనీల ఇళ్ల నిర్మాణానికి సంబంధించి లబ్ధిదారులకు రూ.5 లక్షలు ఇవ్వాలని, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ రాష్ట్ర సమితి మార్చి 2వ తేదీన విజయవాడలో మహాధర్నాకు పిలుపునిచ్చింది. మహాధర్నాను భగ్నం చేసే ప్రయత్నంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. గృహనిర్బంధానికి పాల్పడ్డారు. ఎక్కడికక్కడ సీపీఐ శ్రేణులను అడ్డుకున్నారు. విజయవాడలో మహాధర్నాను విఫలం చేయాలన్న జగన్ సర్కారు ప్రయత్నాలకు పోలీసులు వంతపాడారు. అందులో భాగంగా విజయవాడ మహాధర్నాలో పాల్గొనకుండా చేసేందుకు రామకృష్ణను నంద్యాలలో అడ్డుకున్నారు. రామకృష్ణ అరెస్టుకు యత్నించగా సీపీఐ శ్రేణులు అడ్డుపడ్డాయి. సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు, నాయకులు రమేశ్, బాబా ఫకృద్దీన్ తదితరులు అడ్డుగోడగా నిలువగా సీఐలు, ఎస్ఐలు, స్పెషల్ పార్టీ పోలీసులు విరుచుకుపడ్డారు. నాయకులను బలవంతంగా ఈడ్చివేసి రామకృష్ణను పోలీస్ కారులో ఎక్కించారు. కారుకు అడ్డుపడిన సురేశ్ ధనుంజయుడులను లాగేశారు. అందరిని స్థానిక 2వ పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయినవారిలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శి రంగ నాయుడు, సహాయ కార్యదర్శి బాబా ఫకృద్దిన్, సీపీఐ కార్యవర్గ సభ్యులు సుంకన్న, ప్రసాద్ తదితరులున్నారు. సీపీఐ కర్నూలు జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.జగన్నాథం, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శి చంద్రశేఖర్, పత్తికొండలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాజాసాహెబ్, తుగ్గలి మండల కార్యదర్శి సుల్తాన్, పెద్దకడుబూరు సీపీఐ మండల కార్యదర్శి వీరేశ్‌లను పోలీసులు కర్నూలులో గృహనిర్బంధం చేశారు. అనంతరపురంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీశ్, ఇతర సీపీఐ నాయకులను నిర్బంధించారు.

అరెస్టులకు భయపడం: రామకృష్ణ
అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విజయవాడలో తలపెట్టిన మహా ధర్నాకు తరలివస్తున్న సీపీఐ నేతలు, కార్యకర్తలను ఎక్కడికక్కడ అడ్డుకోవడం, గృహనిర్బంధం చేయడం దారుణమని మండిపడ్డారు. పత్తికొండ, కర్నూలు తదితర కేంద్రాల్లో అరెస్టులు చేశారని, రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ నాయకులను, కార్యకర్తలను అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు. ఎక్కడ అరెస్టు చేస్తే అక్కడ ధర్నాలకు దిగాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు రామకృష్ణ పిలుపునిచ్చారు. అరెస్టులకు భయపడవద్దని, ప్రభుత్వంలో కదలిక వచ్చే వరకు నిరసనలు, ధర్నాలు కొనసాగిస్తామన్నారు. పేదల కోసం ఉద్యమాలు చేస్తున్నామని, ప్రభుత్వానికి మనసుంటే చర్చలు జరిపి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ప్రజాస్వామ్యం ఖూనీ

- జగన్ పాలనపై రామకృష్ణ ఆగ్రహం
- నామినేషన్లు అడ్డుకోవడం దారుణమని విమర్శ
- ఉక్కు పరిశ్రమ పనులు ప్రారంభించాలని డిమాండ్
- పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి

2లో

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని, ఎంఎల్‌సీ ఎన్నికల్లో నామినేషన్ వేయకుండా పోలీసుల ద్వారా అభ్యర్థులను అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు.

మోదీ' బండ బాదుడు

- వంటగ్యాస్ రూ.50 పెంపు
- వాణిజ్య సిలిండర్‌పై రూ.350
- సామాన్యుడి నెత్తిన పిడుగు

న్యూదిల్లీ:
మోదీ సర్కార్ బండ బాదుడు కొనసాగిస్తోంది. దేశంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే సమయంలో స్తబ్దుగా ఉండే బీజేపీ ప్రభుత్వం ఆ ఎన్నికలు పూర్తవగానే ధరల పెంపుతో ప్రజలపై విరుచుకుపడుతోంది. గ్యాస్ సిలిండర్ ధరలు బుధవారం మరోసారి పెరిగాయి. వంట గ్యాస్ ధర సిలిండర్‌కు రూ.50 పెరిగింది. వాణిజ్య సిలిండర్ ధరను రూ.350.50 పెంచింది. దాదాపు ఎనిమిది నెలల తర్వాత ఇది భారీ పెరుగుదల. మూడు ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్నికలు ముగిసిన కొద్ది రోజులకే గ్యాస్ ధరలు పెంచడంపై ప్రతిపక్ష పార్టీలు తీవ్ర విమర్శలు చేశాయి. ప్రభుత్వ

- మిగతా 2 లో

బెంగళూరులో కాకినాడ యువతి

దారుణహత్య

విశాలాంధ్ర-కాకినాడ:
కర్ణాటక రాజధాని బెంగళూరు నగరంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువతి లీలా పవిత్ర (28) దారుణహత్యకు గురైంది. తనను దూరం పెట్టి వేరే వ్యక్తితో పెళ్లికి సిద్ధమైందన్న కోపంతో ప్రియుడు అత్యంత కిరాతంగా ఆమెను పొడిచి చంపేశాడు. బెంగళూరు నగరంలోని జీవనబీమా నగర పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి 7.45 గంటలకు ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లీలా పవిత్ర స్వస్థలం కాకినాడ. ఉద్యోగం నిమిత్తం బెంగళూరు వెళ్లి దొమ్లూర్‌లోని ఓ ప్రైవేటు లాబొరేటరీలో పనిచేస్తోంది. అదే లాబొరేటరీలో ఉద్యోగం చేస్తోన్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన దివాకర్ అనే వ్యక్తితో ఏర్పడిన పరిచయం ప్రేమకు దారితీసింది. ఐదేళ్లుగా ఇద్దరూ ప్రేమించుకుంటున్నారు. ఇటీవల వీరి బంధం గురించి లీల తన ఇంట్లో వాళ్లకు చెప్పగా.. పెళ్లికి వారు అంగీకరించలేదు. దీంతో రెండు నెలల నుంచి

- మిగతా 2 లో

కుట్రపూరిత అరెస్టులు

- అడ్డుకోవడంలో రాజకీయాలు విఫలం
- విచారణ పేరుతో చట్ట ఉల్లంఘనలు
- మోదీ సర్కార్‌కి పావుగా దర్యాప్తు సంస్థలు

న్యూదిల్లీ:
దేశంలో అరెస్టులు, బెదిరింపుల పర్వం కొనసాగుతూనే ఉంది. వీటిని అడ్డుకోవడంలో రాజకీయ పార్టీలు విఫలమవుతూనే ఉన్నాయి. కేంద్ర దర్యాప్తు సంస్థలు విచారణ పేరుతో చట్ట ఉల్లంఘనలకు పాల్పడుతున్నాయి. పోలీసులు ఒక వ్యక్తిని కస్టడీకి కోరడం చాలా హాస్యాస్పదంగా మారింది. దర్యాప్తు కొనసాగుతున్నప్పటికీ పోలీసులు అడ్డగోలుగా అరెస్టులు చేసి, తరచుగా ఛార్జిషీట్ సమర్పణకు గడువును పొడిగిస్తూ తీవ్ర అలస్యం చేసే వ్యూహాన్ని కొనసాగిస్తారు. కేంద్రంలోని మోదీ సర్కారు రెండవసారి అధికారం చేపట్టిన తర్వాత నుంచి కేంద్ర దర్యాప్తు సంస్థలను పూర్తిగా తన పావులుగా వాడుకుంటూ విపక్ష నేతలను, హక్కుల కార్యకర్తలను అరెస్టులు చేయిస్తూ ప్రజాస్వామ్య హననానికి ఒడిగడుతోంది. దిల్లీ మద్యం విధానం కేసులో దిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా అరెస్టు తప్పు. అయితే దీన్ని అర్థం చేసుకోవడానికి, ఆ విషయం చెప్పడానికి ఒకరు న్యాయవాది లేదా న్యాయ నిపుణుడు కానవసరం లేదు. సిసోడియా అడ్డంకులు సృష్టించకుండా విచారణకు సహకరిస్తున్నాడు. ఆయనను వీలైనన్ని సార్లు విచారించవచ్చన్నది సాధారణం కారణం. కేంద్ర దర్యాప్తు సంస్థ చేస్తున్నటువంటి దర్యాప్తు కోసం ఒక వ్యక్తిని అరెస్టు చేయనవసరం లేదు. ఇది అతనిపై మోపబడిన అభియోగాల మెరిట్‌లపై ఎటువంటి అభిప్రాయాన్ని ఇవ్వడానికి కాదు. ప్రశ్నించడం కోసం లేదా వారి నుంచి వాంగ్మూలం పొందడం కోసం ఒక వ్యక్తిని అరెస్టు చేయకూడదనే ఈ సూత్రం భారతదేశంలో పోలీసులచే సాధారణంగా ఉల్లంఘించబడుతోంది. సీనియర్ న్యాయవాది షారుఖ్ ఆలం మాట్లాడుతూ ఈ విలక్షణమైన అరెస్టుల ప్రక్రియను ఇతర దేశాల్లోని ప్రక్రియలతో పోల్చారు. మరింత నాగరిక పోలీసింగ్ అవసరమని అన్నారు. అరెస్టు వెనుక ఉన్న ఆలోచన అవమానపరచడం,

- మిగతా 2 లో

పెట్టుబడులొచ్చేనా?

- రేపు, ఎల్లుండి పెట్టుబడిదారుల సదస్సు
- 26 దేశాల నుంచి 5 నుంచి 8 వేల మంది అతిథులు
- రూ.100 కోట్లతో నగరంలోని రహదారుల సుందరీకరణ
- ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ప్రధాన వేదికలు

జీఐఎస్‌కు విశాఖ ముస్తాబు

విశాలాంధ్ర-విశాఖపట్నం :
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా ఈ నెల 3, 4 తేదీల్లో విశాఖ పట్టణం వేదికగా నిర్వహిస్తున్న ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు (జీఐఎస్) కు ఏర్పాట్లు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. ఆంధ్రా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో బుధవారం నాటికి ప్రధాన వేదికలన్నింటిలో 90 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన వాటిని పూర్తి చేసేందుకు అధికారులు, సిబ్బంది అహర్నిశలూ శ్రమిస్తున్నారు. గురువారం సాయంత్రం నాటికి అన్ని ప్రధాన

- మిగతా 2 లో

ఆప్ కేబినెట్‌లో అతిషి, భరద్వాజ

న్యూదిల్లీ:
ఆప్ కేబినెట్‌లోకి మరో ఇద్దరు కొత్త ఎమ్మెల్యేలు వస్తున్నారు. ఇద్దరు కీలక మంత్రులు మనీశ్ సిసోడియా, సత్యేందర్ జైన్ జైలుకెళ్లడం, రాజీనామా చేయడంతో ఆమ్ ఆద్మీ పార్టీ సర్కార్‌కు పెద్ద ఎదురుదెబ్బ తగిలినట్లయింది. దీంతో వారి స్థానాలను భర్తీ చేసేందుకు కేబినెట్‌లో ఇద్దరు కొత్తవారిని తీసుకుంటున్నారు. ఎమ్మెల్యేలు అతిషీ , సౌరభ్ భరద్వాజ... దిల్లీ కేబినెట్‌లో మంత్రి పదవులు చేపడతారని ఆప్ బుధవారం ప్రకటించింది. దీనికి సంబంధించిన పత్రాలను లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాకు ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పంపినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఉపముఖ్యమంత్రిగా వ్యవహరించిన మనీశ్ సిసోదియా 18 శాఖల బాధ్యతలను చూసుకునేవారు. మరోపక్క సత్యేందర్ జైన్ ఆరోగ్య మంత్రిగా పనిచేశారు. ఆయన కొద్దినెలలుగా జైల్లోనే ఉంటున్నారు. మంగళవారం సాయంత్రం వారిద్దరు రాజీనామా చేశారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటూ జైళ్లకు వెళ్లిన వ్యక్తులు మంత్రులుగా ఉండటం ఏమిటని విపక్షాలు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మీకు పుణ్యముంటుంది మీరు ఏ ఊరువస్తే ఆ ఊర్లో మమ్మల్ని కొట్టేస్తున్నారు,ఆ ప్యాలెస్ లోంచి బయటకు రాకండి జగన్ బాబూ!

పదేపదే... ఫీజు ఒత్తిళ్లు

- మితిమీరిన కార్పొరేట్ ఆగడాలు
- విద్యార్థులపై వేధింపులు
- అలంకార ప్రాయం ఫీజు నియంత్రణ కమిషన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :
ఇంటర్ పరీక్షల సీజన్‌తో కార్పొరేట్ యాజమాన్యాల ఫీజుల వేధింపులు అధికమయ్యాయి. ప్రభుత్వం ఎన్ని సంస్కరణలు తెచ్చినా, ఫీజు నియంత్రణ కమిటీని ఏర్పాటు చేసినా కార్పొరేట్ ఆగడాలను నియంత్రించలేక పోతోంది. వాటిని పర్యవేక్షించాల్సిన పాఠశాల విద్యా ఫీజు నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ ఆలంకార ప్రాయంగా మారిందన్న విమర్శలున్నాయి. ఈ విద్యా సంవత్సరం ముగింపు దశకు చేరడం, పరీక్షల సమయం రావడంతో విద్యార్థులపైన, వారి తల్లిదండ్రులపైన ఫీజుల ఒత్తిళ్లు అధికమయ్యాయి. రెండు పేరొందిన కార్పొరేట్ విద్యా

సంస్థలు బరితెగించి విద్యార్థులను వేధిస్తున్నాయి. ఇంటర్మీడియట్ విద్యామండలి నిబంధనలకు విరుద్ధంగా ఫీజులను ఇష్టానుసారంగా పెంచి, విద్యార్థుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నాయి. డే స్కాలర్ నుంచి హాస్టళ్ల విద్యార్థుల వరకు వారికి నిర్ధారించిన ఫీజులను పూర్తి స్థాయిలో చెల్లించకుంటే తరగతులకు రానీయకుండా, పరీక్షలకు హాజరుకాకుండా ఆటంకాలు సృష్టిస్తున్నారు. సకాలంలో ఫీజుల చెల్లింపులు లేకుంటే, ప్రయోగ పరీక్షలకూ అనుమతించబోమని హెచ్చరిస్తున్నారు. ఈ వేధింపులతో హాస్టల్‌లో ఉండే విద్యార్థులంతా నరకయాతన పడుతున్నారు. ఒక వైపు చదువుల భారం, మరోవైపు యాజమాన్యం ఫీజుల ఒత్తిళ్లతో వారంతా ఆందోళన చెందుతున్నారు. వాటిని భరించలేక, తల్లిదండ్రులకు చెప్పలేక విద్యార్థులు మానసికంగా కుంగిపోతున్నారు. అక్కడక్కడా బలవన్మరణాలకు గురవుతున్నారు. ఈనెల 26 నుంచి ఇంటర్ ప్రయోగ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ ప్రయోగ పరీక్షల సమయానికి విద్యార్థులు పూర్తి స్థాయిలో ఫీజులు చెల్లించకుంటే వారికి రికార్డులు ఇవ్వకుండా, వాటిపై ప్రిన్సిపల్ సంతకం చేయకుండా జాప్యం చేస్తున్నారు. ఈ విడత ప్రయోగ పరీక్షలు జంబ్లింగ్ విధానంలో నిర్వహించడం లేదు. విద్యార్థులు చదువుతున్న కళాశాలల్లోనే వారికి ప్రయోగ పరీక్షలు ఏర్పాటు చేశారు. దీనిని కార్పొరేట్ కళాశాలల

- మిగతా 2 లో

మరో ఆరు కొత్త మండలాలు

- జిల్లా కేంద్రాల్లో అర్బన్ మండలాల విభజన
- మచిలీపట్నంలో కొన్ని గ్రామాలు విలీనం
- రాష్ట్ర ప్రభుత్వ నోటిఫికేషన్ జారీ

2లో

గ్రీస్‌లో ఎక్స్‌ప్రెస్, కార్గో రైళ్లు ఢీ

- 40 మంది సజీవదహనం-85 మందికి గాయాలు
- క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమం
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- ప్రయాణికుల హాహాకారాలతో సీసీటీవీలో భయానక దృశ్యాలు

ఏథెన్స్: గ్రీస్‌లో ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుంది. ఎదురెదురుగా వచ్చిన రెండు రైళ్లు ఢీకొన్నాయి. ఈ దుర్ఘటనలో 40 మంది సజీవ దహనమయ్యారు. 85 మందికి పైగా గాయపడ్డారు. స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం రాత్రి ఏథెన్స్ నుంచి థెసాలోన్కి నగరం మధ్య నడిచే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు.. తెంపీ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో కార్గో రైలును ఢీకొట్టింది. దీంతో ప్రయాణికుల బోగీలు పట్టాలు తప్పాయి. మొదటి మూడు బోగీల్లో మంటలు చెలరేగి 40 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదం సమాచారం అందిన వెంటనే భద్రతా సిబ్బంది, పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయకచర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగినప్పుడు ఇంటర్ సిటీ రైలులో 350 మంది ప్రయాణికులుంటే వీరిలో 250 మంది సురక్షితంగా బయటపడ్డారు. అర్థరాత్రి సమయంలో ప్రమాదం జరగడం, మంటలు చెలరేగడంతో సహాయక చర్యలకు విఘాతం కలిగినట్లు అధికారులు బుధవారం తెలిపారు. ఆర్మీని రంగంలోకి దింపినట్లు చెప్పారు. ప్రమాదం జరిగిన వెంటనే రెండు బోగీలకు మంటలు అంటుకుని, మరో దానికి వ్యాపించాయి. దట్టమైన పొగలు, విరిగిన కిటికీలు, రోడ్డుపై అడ్డంగా శిథిలాలు.. అందులో చిక్కుకున్న ప్రయాణికుల కోసం టార్చిలైట్లతో రెస్క్యూ సిబ్బంది వెతుకుతున్న దృశ్యాలు సీసీటీవీలో రికార్డయ్యాయి. రెండు రైళ్లు బలంగా ఢీకొట్టడంతో దాని తీవ్రత వల్ల ప్రయాణికులు అనేకమంది కిటీల్లో నుంచి బయటకు పడ్డారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

ప్రయాణికులలో చాలా మంది సురక్షితంగా బయట పడగా కొందరు విషమ పరిస్థితుల్లో ఉండటంతో వారి తరలింపు చాలా క్లిష్టంగా మారిందని అగ్నిమాపక విభాగం అధికారి ఒకరు చెప్పారు. కార్గో రైలు థెసాల్కోని నుంచి లారిస్సాకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగిందని ఆయన తెలిపారు. రైళ్లు ఢీకొన్నప్పుడు భూకంపం వచ్చిందనుకున్నామని, సూట్ కేసుతో కిటికీ అద్దం పగలుగొట్టుకుని బయటకు వచ్చినట్లు ఓ ప్రయాణికుడు తెలిపారు.

విశాలాంధ్ర ప్రపంచం

ఫిలిప్పీన్స్‌లో ఉల్లిఘాటు

కిలో రూ.1200పైమాటే...

14ఏళ్ల గరిష్ఠానికి ద్రవ్యోల్బణం

మనీలా: ఉల్లిఘాటు ఫిలిప్పీన్స్‌ను కన్నీరు పెట్టిస్తోంది. ఆ దేశ రాజధాని మనీలాలో కిలో ఉల్లి ధర రూ.1200 కుపైగానే పలుకుతోంది. దీంతో సామాన్యుల వంటగదుల్లోనే కాకుండా రెస్టారెంట్లలోనూ ఉల్లి జాడ లేకుండా పోయింది. పిలిప్పీన్స్‌లో ద్రవ్యోల్బణం 14 ఏళ్ల గరిష్ఠానికి చేరింది. ఈ నేపథ్యంలో ఉల్లి ధరలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. చిన్న ఉల్లి ఒక్కొక్కటి రూ.120 లెక్కన అమ్ముతుంటే కొనలేక దానిని వాడటమే మానేశామని స్థానికురాలు క్యాండీ రోసా (56) తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో ఉల్లి పంట చేతికి రాక ముందే వాటిని తవ్వి అమ్మకానికి తెస్తున్నారు. దీంతో డిమాండుకు సరిపడా సరఫరా ఉండేలా విదేశాల నుంచి 21వేల టన్నుల ఉల్లి దిగుమతికి ఫిలిప్పీన్స్ ప్రభుత్వం నిర్ణయించింది. ఉల్లిని నిల్వ చేస్తున్న వ్యాపారుల గోడౌన్లపై ఆకస్మిక దాడులకు ఆదేశాలిచ్చింది. కానీ ఉల్లి ధర దిగి రావడం లేదు. ఎన్నడూ లేని విధంగా ఉల్లి ధరలు అమాంతం పెరిగినట్లు రైతులు చెప్పారు. మధ్య ఆసియా నుంచి మనీలాకు వచ్చిన ఓ విమానంలో ఉల్లిపాయల బస్తాలను ఎయిర్‌పోర్ట్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా వీటిని తరలించినట్లు గుర్తించారు. అధికారిక గణాంకాల ప్రకారం ఒక్కో పౌరుడు ఏడాదికి సగటున 2.34 కిలోల ఉల్లిని వినియోగిస్తారు. దేశీయ అవసరాలను తీర్చే స్థాయిలో ఉల్లి ఉత్పత్తి ఉన్నాగానీ వాతావరణ పరిస్థితుల వల్ల ఏడాదికి ఒకసారి మాత్రమే ఉల్లి సాగుకు అవకాశం ఉంటుంది.

బైడెన్ ఎక్స్‌పోర్ట్ కౌన్సిల్‌లోకి పుతిన్ రంజన్, రాజేశ్ సుబ్రమణ్యం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తన శక్తిమంతమైన ఎక్స్‌పోర్ట్ కౌన్సిల్‌లో ఇద్దరు భారత సంతతి అమెరికా కార్పొరేట్‌లకు స్థానం కల్పించారు. అంతర్జాతీయ వాణిజ్యంపై ప్రధాన సలహా కమిటీగా ఎక్స్‌పోర్ట్ కౌన్సిల్ ఉంది. డెలాయిట్ కన్సల్టింగ్ మాజీ సీఈవో పునిత్ రంజన్, ఫెడెక్స్ ప్రస్తుత అధ్యక్షుడు, సీఈవో రాజేశ్ సుబ్రమణ్యం పేర్లను బైడెన్ ఈ కమిటీ కోసం నియమించినట్లు శ్వేతసౌధం వెల్లడించింది. ఎక్స్‌పోర్ట్ కౌన్సిల్ చైర్మన్‌గా మార్క్ ఎడ్విన్ (కాస్టెల్ సిస్టమ్స్ చైర్మన్) ఉంటారు. కార్పొరేట్ రంగంతో పాటు కార్మిక, రియల్ ఎస్టేట్, జాతీయ భద్రత, న్యాయ రంగాలకు చెందిన 25 మందికిపైగా ఎక్స్‌పోర్ట్ కౌన్సిల్ సభ్యులుగా ఉన్నారు. వీరిలో కారెన్ ఎస్.లించ్ (సీవీఎస్ హెల్త్ సీఈవీ, అధ్యక్షుడు), జాన్ లాప్లర్ (ఫోర్డ్ సీఎఫ్‌వో), గారెత్ జోయ్‌సే (ప్రెటెర్రా సీఈవో), బ్రెట్ హర్ట్ (యునైటెడ్ ఎయిర్‌లైన్స్ అధ్యక్షులు), బెత్ ఫోర్డ్ (లాండ్ ఓ లేక్స్ అధ్యక్షులు, సీఈవో), క్రిస్టియానో ఆర్. ఆమన్ (క్వాల్‌కామ్ సీఈవో) వంటి ప్రముఖులు ఉన్నారు. కాగా రంజన్ గతేడాది డిసెంబరు 31న డెలాయిట్ గ్లోబల్ సీఈవోగా రిటైరయ్యారు. ప్రస్తుతం డెలాయిట్ గ్లోబల్ సీఈవో ఎమిరటస్‌గా ఉన్నారు. అలాగే సుబ్రమణ్యం.. ఫెడెక్స్ కార్పొరేషన్ అధ్యక్షునిగా, సీఈవోగా కొనసాగుతున్నారు. ఐదుగురితో కూడిన ఎగ్జిక్యూటివ్ కమిటీ, ఫెడెక్స్ స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్‌గానూ కీలక బాధ్యతల్లో ఆయన ఉన్నారు.

ప్రజాస్వామ్యం ఖూనీ

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని, ఎంఎల్‌సీ ఎన్నికల్లో నామినేషన్ వేయకుండా పోలీసుల ద్వారా అభ్యర్థులను అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ ఎంఎల్‌సీ ఎన్నికల్లో పోటీకి చాలామంది ఆసక్తి ప్రదర్శించారని, అలాంటి వారిని నామినేషన్ వేయకుండా అడుగడుగునా అడ్డుకున్నారని విమర్శించారు. ప్రతిపక్షాలను పోటీలో లేకుండా చేయడం దుర్మార్గమని చెప్పారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల్లోనూ వైసీపీ అభ్యర్థులే పోటీ చేయాలని, ఇవి రానున్న అసెంబ్లీ ఎన్నికలకు సెమీఫైనల్స్ వంటివని మంత్రి ధర్మాన ప్రసాదరావు చెబుతున్నారన్నారు. అభ్యర్థులు మారువేషాలలో వెళ్లి నామినేషన్లు వేయాల్సిన దుస్థితి వచ్చిందని, ఇందుకు సీఎంగా జగన్ సిగ్గుతో తలదించుకోవాలన్నారు. ఏకగ్రీవం కోసం అభ్యర్థులను ప్రతిపాదించిన వ్యక్తులను బెదిరించారని, ఆ సంతకాలు ఫోర్జరీవని వారితోనే చెప్పించారని రామకృష్ణ గుర్తుచేశారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎంఎల్‌సీ అభ్యర్థులుగా ఏ రాజకీయ పార్టీ గతంలో పోటీకి దించలేదన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి, చంద్రబాబు ఆ సంప్రదాయం పాటించారన్నారు. జగన్ మాత్రమే పార్టీ తరపున అభ్యర్థులను బరిలో దించారని విమర్శించారు. స్వయంగా మంత్రులు రంగంలోకి దిగి...పట్టభద్రులు, ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించి రూ.2 వేలు, రూ.5 వేలు పంచుతున్నారని మండిపడ్డారు. వైసీపీ అఘాయిత్యాలను అడ్డుకోవడానికి డాక్టర్లు, ఇంజినీర్లు, పట్టభద్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఎంఎల్‌సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థులకు ఓటువేయాలని, జగన్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మూడు పట్టభద్రుల నియోజకవర్గాలు, రెండుఉపాధ్యాయ నియోజవర్గాల్లో ఎన్నికలు జరగనున్నాయని పేర్కొన్నారు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం సీపీఐ పాదయాత్రకు ఉపక్రమించడం వల్లే సీఎం జగన్ ఆఘమేఘాల మీద జిందాల్ కంపెనీతో ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన చేయించారని రామకృష్ణ అన్నారు. ఉక్కు పరిశ్రమకు ఇప్పటికి నాలుగుసార్లు శంకుస్థాపనకులు చేశారన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి, చంద్రబాబు ఒక్కోసారి శంకుస్థాపన చేయగా జగన్ ఏకంగా రెండుసార్లు చేశారని గుర్తుచేశారు. ఇప్పటికైనా పరిశ్రమ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వాటిని పునాదిరాళ్లకే పరిమితం చేయవద్దని సూచించారు. కడప ఉక్కు పరిశ్రమ పూర్తి చేసిన తర్వాతే జగన్ ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. జగన్ చిన్నాన్న వివేకానందరెడ్డి హత్యకు గురై నాలుగేళ్లు అవుతున్నా దోషులు ఎవరనేది రాష్ట్ర ప్రభుత్వం, సీబీఐ ఇప్పటికీ తేల్చకపోవడం దారుణమని వ్యాఖ్యానించారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లెనిన్‌బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు, కార్యదర్శి శివారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, నగర కార్యదర్శి వెంకటశివ, నాయకులు నాగసుబ్బారెడ్డి, బాదుల్లా, ఆంజనేయులు, చంద్రశేఖర్, వేణుగోపాల్, మద్దిలేటి పాల్గొన్నారు.

మరో ఆరు కొత్త మండలాలు

జిల్లా కేంద్రాల్లో అర్బన్ మండలాల విభజన

మచిలీపట్నంలో కొన్ని గ్రామాలు విలీనం

రాష్ట్ర ప్రభుత్వ నోటిఫికేషన్ జారీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్రంలో కొత్తగా మరో 6 మండలాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా కేంద్రాల్లోని అర్బన్ మండలాలను ఇకపై అర్బన్, రూరల్ మండలాలుగా విభజిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రాథమిక నోటిఫికేషన్ జారీచేసింది. ఈ మేరకు వాటిపై ప్రభుత్వం ప్రజాభిప్రాయాన్ని సేకరించనుంది. ప్రజాభిప్రాయ సేకరణ 30 రోజుల పాటు కొనసాగుతుంది. ఈలోగా స్థానికులు తమ అభ్యంతరాలను తెలియజేయాల్సి ఉంటుంది. ఇది వరకు రాష్ట్రంలో కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిన ప్రక్రియకు కొనసాగింపుగా ప్రభుత్వం దీన్ని చేపట్టింది. విజయనగరం, చిత్తూరు, నంద్యాల, అనంతపురం, ఒంగోలు జిల్లా కేంద్రాలను అర్బన్, రూరల్ మండలాలుగా విభజించింది. ఆయా జిల్లా కేంద్రాల్లో పెరుగుతున్న పట్టణీకరణ, శివారు ప్రాంతాల అభివృద్ధి దృష్ట్యా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పుడున్న పరిధులే కొత్త మండలాల్లోనూ కొనసాగుతాయి. అందులో మార్పులు చేయలేదు. రెవెన్యూపరంగా మరింత సుపరిపాలనను అందించడంలో భాగంగా ఈ ప్రక్రియను చేపడుతోంది. మచిలీపట్నం జిల్లా కేంద్రాన్ని దక్షిణ, ఉత్తర మండలాలుగా విభజించనున్నట్లు పేర్కొంది. ఇందుకోసం మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కొన్ని వార్డులు, శివారు గ్రామాలను కలుపుకొంది. కార్పొరేషన్ పరిధిలోని ఒకటి నుంచి 19 వార్డులతో పాటు 40వ వార్డు, 18 గ్రామాలను మచిలీపట్నం ఉత్తర మండలంగా, అలాగే 20 నుంచి 39వ వార్డులతో పాటు, మచిలీపట్నం రూరల్ పరిధిలోని 12 గ్రామాలను మచిలీపట్నం దక్షిణ మండలంగా విభజించింది. మండలాల విభజనపై అభ్యంతరాలు, సలహాలు, సూచనలు ఉంటే వాటిని 30 రోజుల్లోగా ఆయా జిల్లాల కలెక్టర్లకు తెలియజేయొచ్చు అని నోటిఫికేషన్ పేర్కొంది.

కుట్రపూరిత అరెస్టులు

(మొదటిపేజీ తరువాయి)

భయపెట్టడం లేదా శిక్షించడమేనా? విచారణే లక్ష్యంగా చేసుకున్న వ్యక్తికి శిక్ష కాకూడదని గుర్తుంచుకోవాలి. కానీ ఇది తరచుగా ఉంటుందని అన్నారు. ఈ కేసులో సిసోడియాపై నేరారోపణలు చేసే సాక్ష్యాలను సేకరించామని, ఆయన నుంచి మరిన్ని వివరాలు తెలుసుకోవాలని సీబీఐ పేర్కొంది. కానీ ఇతర సందర్భాల్లో సాక్ష్యాలను సేకరించే ప్రక్రియ కూడా అరెస్టుతో ప్రారంభమవుతుంది. దీనిపై తగినంత చర్చ జరగలేదు. రాజకీయ పార్టీలు ఎప్పుడూ దాని గురించి మాట్లాడలేదు. కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి పి.చిదంబరాన్ని విచారణ నిమిత్తం అరెస్టు చేసినపుడు కూడా వారు ఆ పని చేయలేదు. హైకోర్టు కూడా ఆయనకు బెయిల్ నిరాకరిస్తూనే ఉంది. అంతిమంగా సుప్రీం కోర్టు ఆయనను కాపాడింది. షర్జీల్ ఇమామ్ లాంటి వ్యక్తిని అరెస్టు చేసినప్పుడు లేదా సిద్ధిక్ కప్పన్‌ను కటకటాల వెనక్కి నెట్టినప్పుడు రాజకీయ వర్గం నుంచి ఒక మాట ఆశించడం కూడా వ్యర్థం. పోలీసులు ఒక వ్యక్తిని కస్టడీకి కోరడం చాలా హాస్యాస్పదంగా ఉంది. ఎందుకంటే దాని దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది. ఛార్జిషీట్‌ను సమర్పించడానికి సమయం అడిగే, కాలపరిమితిని పొడిగించే స్వేచ్ఛను పోలీసులు తరచుగా తీసుకుంటారు. ఆ తర్వాత సప్లిమెంటరీ ఛార్జిషీట్‌లను సమర్పిస్తామని విజ్ఞప్తి చేస్తారు. అందువలన ఈ ఆలస్యం వ్యూహం ఎప్పటికీ కొనసాగుతుంది. విచారణ ప్రారంభమయ్యే వరకు జైలు జీవితం గడిపే వ్యక్తులు ఉన్నారు. ఎల్గార్ పరిషత్ పేరుతో జైలుకెళ్లిన వారి ఇటీవలి కేసులు, ఢిల్లీ అల్లర్ల 'కుట్ర కేసులు' అదే కోవకు చెందినవి. సిసోడియా అరెస్టుపై కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు నేతలు సంబరాలు చేసుకోవడం, అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేసింది. ఇలా చేయడం ద్వారా ఆ పార్టీ తప్పుడు పద్ధతిని సమర్థిస్తోంది. బీజేపీ ఈ అరెస్టుల సంస్కృతిని, దీర్ఘకాల నిర్బంధాన్ని ఉపయోగిస్తోందన్నది సుస్పష్టం. చిదంబరం అరెస్టు, రాహుల్ గాంధీ లేదా సోనియా గాంధీని సుదీర్ఘంగా విచారణ చేయడం, షార్జీల్ ఇమామ్‌ను సుదీర్ఘంగా నిర్బంధించడం వంటివి ఒక వర్గానికి సంతోషం కలిగించాయి. కానీ అదే కేంద్రంలోని అధికార పార్టీకి అలవాటుగా మారడానికి మనీశ్ సిసోడియా, ఆయన ఆప్ సహచరులు తమను తాము నిందించుకోవలసి ఉంటుంది. 'ఇండియా ఎగైనెస్ట్ కరప్షన్' ఉద్యమం జరుగుతున్న నాటి వారి పాత ట్వీట్లు బయటపడ్డాయి. వాటిలో లాలూ యాదవ్, ములాయం సింగ్ యాదవ్‌ను అరెస్ట్ చేయాలని కోరారు. సిసోడియా స్వయంగా వారిని ఎగతాళి చేస్తూ, తాము ఏ తప్పూ చేయకుంటే అరెస్టులకు ఎందుకు భయపడతారని ప్రశ్నించారు. దాని సందేశాన్ని బీజేపీ, ఆర్ఎస్ఎస్ మరింత క్రమపద్ధతిలో ఉపయోగించుకుంటున్నాయి. అయితే ప్రస్తుతం మనీశ్ సిసోడియాకు ఏది జరుగుతున్నప్పటికీ, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) పునరాలోచన చేయదన్నది కూడా స్పష్టం. ఎందుకంటే అదే ఆలోచన, పాలక విధానాలు దాని స్వంత రాజకీయాలను ఏర్పరుస్తాయి

పదేపదే... ఫీజు ఒత్తిళ్లు

(మొదటిపేజీ తరువాయి)

యాజమాన్యం అదునుగా తీసుకుని, పూర్తిగా ఫీజులు చెల్లించిన వారికే వెసులుబాటు కల్పిస్తోంది. ఈనెల 15న ఇంటర్ ప్రథమ, 16న ఇంటర్ ద్వితీయ వార్షిక పరీక్షలు ప్రారంభమవుతాయి. ఆలోపు నిర్వహించే ప్రీ పబ్లిక్ పరీక్షలకు పూర్తి స్థాయి ఫీజు చెల్లించని వారిని నిలుపుదల చేస్తామని ఆయా కళాశాలల సిబ్బంది హెచ్చరిస్తున్నారు. గతంలోనూ ఇలాంటి సంఘటనలు కొనసాగాయి. మళ్లీ పునరావృతం అవుతున్నప్పటికీ ప్రభుత్వంగానీ, పాఠశాల విద్యా ఫీజు నియంత్రణ కమిషన్‌గానీ శాశ్వత చర్యలకు ఉపక్రమించలేదు.

పాఠశాల ఫీజు నియంత్రణ కమిషన్ ఎక్కడ?

సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే కార్పొరేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజులను అరికట్టేందుకుగాను పాఠశాల విద్య ఫీజు నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్‌ను ఏర్పాటు చేశారు. దానికి రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో చైర్మన్‌తో పాటు కమిటీ సభ్యులను నియమించింది. వారికి గౌరవ వేతనం, అధికార ప్రయోజనాలను కల్పిస్తోంది. ఈ నాలుగేళ్లలో కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజులు, చదువుల ఒత్తిళ్లతో విద్యార్థుల బలవన్మరణాలకు గురయ్యారు. వాటిపై మొక్కుబడిగానే పాఠశాల విద్యా కమిషన్ దర్యాప్తు కొనసాగించింది. 1 నుంచి 10, ఇంటర్మీడియట్ విద్యార్థులకు కమిషన్ ఫీజులు నిర్ధారిస్తూ స్పష్టమైన ఉత్తర్వులు జారీజేసినప్పటికీ... అవి అమలుకు నోచుకోలేదు. కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యం ఐక్యంగా న్యాయస్థానాలను ఆశ్రయించడంతో వారికి దీటుగా ఫీజు నియంత్రణ కమిషన్ వాదనలు వినిపించలేక పోయింది. ఆయా ఉత్తర్వులు అమలుకు నోచుకోలేదు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా, చట్టబద్ధంగా ఏర్పాటు చేసిన ఫీజు నియంత్రణ కమిషన్ నిరుపయోగంగా మారిందని విద్యార్థులు, తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జగన్ ప్రభుత్వం స్పందించి ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, ఫీజుల పేరుతో విద్యార్థులను వేధించే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జిల్లాస్థాయి పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేయాలి : ఏపీ పేరెంట్స్ అసోసియేషన్

విద్యా సంస్థల్లో ఫీజుల ఒత్తిళ్లపైన, అధిక ఫీజుల నియంత్రణపైన జిల్లా స్థాయి మానటరింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలని ఏపీ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు శిఖరం నరహరి డిమాండ్ చేశారు. విద్యార్థులను ఫీజుల పేరుతో హింసిస్తే చట్టరీత్యా నేరమని తెలిసినప్పటికీ, కార్పొరేట్ యాజమాన్యాలు మొండిగా వారిపై ఒత్తిళ్లు చేస్తోందని మండిపడ్డారు. అటు ఇంజినీరింగ్ విద్యా సంస్థల్లోనూ వేధింపుల పర్వం కొనసాగుతోదని, ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాలేదని, వాటిని విద్యార్థుల తల్లిదండ్రులే చెల్లించాలంటూ యాజమాన్యాలు ఆదేశించడాన్ని తప్పుపట్టారు. చివరి సంవత్సర విద్యార్థులపై బలంగా వేధింపులున్నాయని తెలిపారు. విద్యా సంస్థల్లో అధిక ఫీజులు అరికట్టేందుకుగాను ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని జిల్లాస్థాయి మానటరింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలని అన్నారు.

మోదీ' బండ బాదుడు

(మొదటిపేజీ తరువాయి)

యాజమాన్యంలోని ఇంధన రిటైలర్ల ధర నోటిఫికేషన్ ప్రకారం దిల్లీలోని 14.2 కిలోల వంట గ్యాస్ సిలిండర్ ధర ఇప్పుడు రూ.1,053 నుంచి రూ.1,103కి చేరింది. ప్రభుత్వ యాజమాన్యంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) 14.2 కిలోల సబ్సిడీ లేని ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.1,103గా పేర్కొంది. ఉజ్వలయేతర వినియోగదారులకు ప్రభుత్వం ఎటువంటి సబ్సిడీని చెల్లించదు. వంట గ్యాస్ రీఫిల్‌లను కొనుగోలు చేయడానికి వారు చెల్లించాల్సిన రేటు ఇది.

ఇక ప్రధాన మంత్రి ఉజ్వల యోజన కింద ఉచిత కనెక్షన్ పొందిన 9.58 కోట్ల మంది పేదలకు ప్రభుత్వం సిలిండర్‌కు 200 రూపాయల సబ్సిడీ చెల్లిస్తుంది. వాటి ధర సిలిండర్‌కు రూ.903. కాగా, చివరిసారిగా జులై 4, 2022న గ్యాస్ సిలిండర్ ధరను సవరించారు. తాజా పెంపుతో ఎల్‌పీజీ ఇప్పుడు ముంబైలో 14.2 కిలోల సిలిండర్‌పై రూ.1,102.50, కోల్‌కతాలో రూ.1,129, చెన్నైలో రూ.1,118.50గా ఉంది. స్థానిక పన్నులను బట్టి రాష్ట్రానికి రాష్ట్రానికి రేట్లు మారుతూ ఉంటాయి. అలాగే, హోటళ్లు, రెస్టారెంట్లలో ఉపయోగించే వాణిజ్య ఎల్‌పీజీ ధరను 19 కిలోల సిలిండర్‌కు రూ.350.5 మేర పెంచడంతో దాని ధర రూ.2,119.5కి చేరింది. ఈ పెరిగిన రేట్లతో చూస్తే తెలుగు రాష్ట్రాలలో సిలిండర్ ధర రూ.50 మేర పెరగడంతో మొత్తంగా రూ.1155కు చేరింది. హైదరాబాద్‌లో గ్యాస్ సిలిండర్ ధర రూ.1155 కాగా.. ఆంధ్ర ప్రదేశ్‌లో ధర రూ.1161కి చేరింది.

ఇది నిజంగానే సామాన్యుడి నెత్తిన పెనుబారంగా మారనుంది. సిలిండర్ ధర పెరిగినా కూడా సబ్సిడీ రావడం లేదు. గతంలో సిలిండర్ ధర పెరిగితే సబ్సిడీ కూడా పెరిగేది కానీ ఇప్పుడు సబ్సిడీ కూడా ఎత్తివేయడంతో సామాన్యుల నెత్తిన పిడుగు పడినట్లయింది. ఒక సంవత్సరం క్రితం రష్యా ఉక్రెయిన్‌పై దాడి చేసిన తర్వాత వాణిజ్యపరమైన ఎల్‌పీజీ రేట్లు ఎక్కువ లేదా తక్కువ ఖర్చుతో సమానంగా పెరిగాయి. వాణిజ్య ఎల్‌పీజీ ధరలు చివరిసారిగా జనవరిలో సిలిండర్‌కు రూ.25 చొప్పున పెంచారు. హోలీకి ముందు ప్రభుత్వం ఇంధన రేట్లను, ముఖ్యంగా దేశీయ ఎల్‌పీజీని పెంచిందని ప్రతిపక్షం విమర్శించింది. మోదీ ప్రభుత్వ హయాంలో సామాన్యులు ద్రవ్యోల్బణంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ట్వీట్ చేశారు.

శివసేన-ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రేకు చెందిన ప్రియాంక చతుర్వేది ఇది మోదీ ప్రభుత్వ హోలీ కానుక అని అన్నారు. ఇదిలాఉండగా, ఏటీఎఫ్ ధరను 4 శాతం తగ్గించారు. దీనిప్రకారం, దిల్లీలో విమాన ఇంధన ధరలు కిలోలీటర్‌కు రూ.4,606.50 తగ్గి రూ.1,07,750.27కి చేరాయి.

యువతి దారుణహత్య

(మొదటిపేజీ తరువాయి)

లీలా... దివాకర్‌ను దూరం పెడుతూ వస్తోంది. ఇటీవల ఆమెకు మరో వ్యక్తితో వివాహం నిశ్చయమైందని తెలుసుకున్న ప్రియుడు ఆమెపై కోపం పెంచుకున్నాడు. విధులు ముగించుకుని బయటకు వచ్చిన లీలపై ఆఫీసు బయటే కత్తితో దాడిచేశాడు. సహోద్యోగులు చూస్తుండగానే అనేకమార్లు విచక్షణారహితంగా పొడిచాడు. సమాచారమందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని దివాకర్‌ను అరెస్టు చేశారు. ఈ ఘటనతో తీవ్రంగా గాయపడిన లీలను సమీపంలోని ఆసుపత్రికి తరలించగా...అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆమె ఒంటిపై 16 చోట్ల కత్తితో పొడిచిన గాయాలున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు బెంగళూరు పోలీసులు వెల్లడించారు.

ఆప్ కేబినెట్‌లో అతిషి, భరద్వాజ

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నించడంతో ఈ రాజీనామాలు జరిగాయి. ఇవి పరిపాలనాపరమైన నిర్ణయాలే తప్ప నేరాన్ని అంగీకరించినట్లు కాదని ఆప్ స్పష్టం చేసింది. ఇదిలా ఉంటే ఆప్ మంత్రుల రాజీనామాలను లెఫ్టినెంట్ గవర్నర్... రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పంపారు. ఈ పరిణామాల మధ్య దిల్లీలోని ఆప్ కార్యాలయం వద్ద భారీగా పోలీసులను మోహరించారు. బారికేడ్లు ఏర్పాటు చేశారు.

వారి 'టార్గెట్' కేజ్రీవాల్: సిసోడియా

దిల్లీ మద్యం కుంభకోణం కేసులో సీబీఐ అరెస్టు తర్వాత మనీశ్ సిసోడియా తన ఉపముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆయనతోపాటు మాజీ ఆరోగ్యమంత్రి సత్యేందర్ జైన్ కూడా పదవి వీడారు. ఈ మేరకు ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు సిసోడియా రాజీనామా లేఖ పంపారు. ఎనిమిదేళ్లుగా నిజాయతీగా పనిచేస్తున్నప్పటికీ తనపై అవినీతి ఆరోపణలు రావడం దురదృష్టకరమని, ఈ ఆరోపణలన్నీ వాస్తవాలు కాదని లేఖలో పేర్కొన్నారు. అరవింద్ కేజ్రీవాల్ స్వచ్ఛమైన రాజకీయాలకు భయపడి కొందరు బలహీనులు పిరికితనంతో చేస్తున్న కుట్ర మాత్రమేనని, వారి లక్ష్యం తాను కాదని తెలిపారు. మీరే (కేజ్రీవాల్) వారి అసలైన టార్గెట్ అని వెల్లడించారు. కేవలం దిల్లీనే కాదు...యావత్ దేశ ప్రజలు మిమ్మల్ని ఓ గొప్ప నేతగా చూస్తున్నారు. సరికొత్త విధానాలతో ప్రజల్లో మార్పు తెచ్చేందుకు మీరు చేస్తున్న ప్రయత్నాలు.. మీకున్న సామర్థ్యాలపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగిందని కేజ్రీవాల్‌కు రాసిన లేఖలో సిసోడియా పేర్కొన్నారు. ఆర్థిక సంక్షోభం, పేదరికం, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, అవినీతి వంటి సమస్యలను ఎదుర్కొంటున్న కోట్లమంది కళ్లల్లో కేజ్రీవాల్ ఓ ఆశాదీపంగా కనిపిస్తున్నారని తెలిపారు. తన తండ్రి గురించి ప్రస్తావించిన సిసోడియా.. విద్య గురించి ఆయన రాసిన మంచి మాటలతో కూడిన చిత్రాన్ని ప్రతిరోజు ఉదయం లేవగానే చూస్తానని అన్నారు. తల్లిదండ్రులు ఇలా పెంచడం వల్లే నిజాయతీ, సమగ్రత అనే విలువలు తనలో భాగమయ్యాయని పేర్కొన్నారు. ఇప్పటికే ఎన్నో ఎఫ్ఐఆర్‌లు తనపై నమోదు చేశారని, మీ నుంచి దూరం చేసేందుకు మరిన్ని ప్రయత్నాలు చేస్తున్నారని లేఖలో సిసోడియా వివరించారు.

పెట్టుబడులొచ్చేనా?

(మొదటిపేజీ తరువాయి)

వేదికలూ అందుబాటులోకి వచ్చేస్తాయని సంబంధిత ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. ఎ.మల్లికార్జున తెలిపారు. సదస్సు నిర్వహణలో భాగంగా రూ.100 కోట్లతో నగరంలోని రోడ్లను సుందరీకరిస్తున్నామని వెల్లడించారు.

26 దేశాల నుంచి అతిరథ మహారథులు

సదస్సుకు 26 దేశాల నుంచి అతిథులు, పెట్టుబడిదారులు విచ్చేస్తున్నారు. ఈ మేరకు నగరంలో ఉన్న అనేక హోటళ్లలో 750కు పైగా గదులను ఇప్పటికే కేటాయించారు. అలాగే మరో వెయ్యి వరకు ప్రైవేటుగా కొంతమంది గదులను బుక్ చేసుకున్నారు. అతిథులను ఆయా హోటళ్ల నుంచి ప్రధాన వేదిక వద్దకు తీసుకొచ్చేందుకు నోడల్ ఆఫీసర్లను, ప్రత్యేక సిబ్బందిని జిల్లా కలెక్టర్ అధ్వర్యంలో ఇప్పటికే నియమించారు. అలాగే అతిథులు బస చేసే హోటళ్ల వద్ద వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నారు. అతిథుల్లో కొంతమంది ప్రత్యేక విమానాల్లో విశాఖపట్టణం ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. మరికొంత మంది ప్రత్యేక హెలికాప్టర్లలో ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకోనున్నట్లు అధికారులు వెల్లడించారు. ముఖ్యమంత్రి దిగేందుకు, ఇతర హెలికాప్టర్లు దిగేందుకు సంబంధిత ఏర్పాట్లు ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరుగుతున్నాయి.

ప్రారంభమైన రిజిస్ట్రేషన్ ప్రక్రియ

కళాశాల మైదానంలో పెట్టుబడిదారులు వచ్చే ప్రధాన ప్రవేశం వద్ద రిజిస్ట్రేషన్ కౌంటర్ ఏర్పాటు చేశారు. అందులో 40 డెస్కులను ఏర్పాటు చేశారు. అందుకు తగ్గ నోడల్ అధికారులను, సిబ్బందిని కేటాయించారు. ఈ మేరకు బుధవారం నుంచే రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించినట్లు పరిశ్రమల శాఖ ఈడీ చెప్పారు. 1, 2వ తేదీల్లో స్థానికంగా ఉన్న పెట్టుబడుదారుల నుంచి వివరాలు సేకరించి రిజిస్ట్రేషన్ చేస్తున్నామన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వెంటనే ప్రత్యేక కిట్ అందజేస్తామని వివరించారు. అనంతరం వారికి కేటాయించిన స్టాలు, హాలును తెలియజేస్తారని వెల్లడించారు.

4 వేల మంది అతిథులకు డైనింగ్ ఏరియా

ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో రూపుదిద్దుకుంటున్న ప్రధాన వేదికల్లో డెలిగేటెడ్ డైనింగ్ ఏరియా ఒక్కటి. ఇక్కడ సుమారు 4 వేల మంది కూర్చొని భోజనం చేసేలా చర్యలు తీసుకుంటున్నామని, సంబంధిత ఏర్పాట్లు చేస్తున్నామని పరిశ్రమల శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వివరించారు. ప్రపంచం నలుమూలల నుంచి విచ్చేస్తున్న అతిథులను దృష్టిలో ఉంచుకొని అన్ని రకాల మెనూలూ తయారు చేయిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఆంధ్ర ప్రదేశ్ సంప్రదాయ వంటకాలను కూడా చేయిస్తున్నామన్నారు.

చర్చలు... సెమినార్లకు సకల ఏర్పాట్లు

ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో రూపుదిద్దుకుంటున్న వేదికల్లో మూడవది... అన్ని రకాల కంపెనీలకు, సదస్సులకు చెందిన సెమినార్లు నిర్వహించేందుకు ఉద్దేశించినది. ఇక్కడ అన్ని దేశాలు, దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన కంపెనీలు, పెట్టుబడిదారులు చర్చలు సాగిస్తారు. అధికారికంగా సెమినార్లు నిర్వహిస్తారు. ఎంవోయూలు, పెట్టుబడి ప్రాజెక్టులకు సంబంధించి నిర్ణయాలు ఇక్కడే తీసుకుంటారు. దీనికి సమీపంలో ఉన్న ప్రధాన సెమినార్ హాలులో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సదస్సు ఉద్దేశాలను తెలుపుతూ ప్రారంభోపన్యాసం చేసి మొదటి రోజు కార్యక్రమాలను ప్రారంభిస్తారు. ప్రధాన హాలు వద్ద కూర్చునేందుకు ఏర్పాట్లు, సుందరీకరణ పనులు ప్రత్యేక నిపుణుల అధ్వర్యంలో జరుగుతున్నాయి.

ఏపీ పెవిలియన్ పేరుతో ప్రత్యేక ఎగ్జిబిషన్

ముఖ్యమంత్రికి కేటాయించిన ప్రత్యేక వేదికకు సమీపంలో ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో మద్దిలపాలెం వైపు సుమారు 137 స్టాళ్లతో ప్రత్యేక ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో స్టార్టప్ జోన్‌లు, కంట్రీ ఎరినా, రెన్యువబుల్ ఎనర్జీ, హ్యాండ్‌లూమ్స్-టెక్స్‌టైల్స్, పర్యాటకం, ఆటో, ఏరో స్పేస్, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఫార్మా, హెల్త్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, లాజిస్టిక్స్, అగ్రికల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్, ఎరువులు, పెట్రోలియం ఉత్పత్తుల స్టాళ్లు ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రత్యేకంగా మారిటైం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పోర్టు ఇండస్ట్రీస్, ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ పరిధిలో నడిచే కంపెనీలు, ఏపీఐఐసీ పరిధిలో ఉండే కంపెనీలు, గ్రామ సచివాలయాలు, పాఠశాల విద్య, పట్టణ ప్రణాళిక, పంచాయతీ రాజ్, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర అంశాలు ప్రదర్శనలో ఉంటాయి.

సభా స్థలంలోనే సీఎంకు ప్రత్యేక బస

ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సులో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఉండేందుకు సభా ప్రాంగణంలోనే ప్రత్యేక బస ఏర్పాటు చేస్తున్నారు. మెయిన్ సమినార్ హాలుకు అనుసంధానంగా ఈ వేదికను రూపొందిస్తున్నారు. ఇక్కడే ముఖ్య అతిథులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు కూడా వేచి ఉంటారు. సదస్సుకు సంబంధించిన వివరాలు అందించేందుకు వీలుగా ముఖ్యమంత్రి ఉండే వేదికలోనే మీడియాకు ప్రత్యేక స్థలం కేటాయించనున్నారు. మీడియా వారికి సీటింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. మీడియా బ్రీఫింగ్ కేంద్రం కూడా ఏర్పాటు చేస్తున్నారు. సమాచార శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. సదస్సు ఏర్పాట్ల పర్యవేక్షణకు జిల్లా అధికారులు, పరిశ్రమల శాఖ అధికారులతో కూడిన ప్రత్యేక బృందాలను నియమించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ, భోజన ఏర్పాట్లు, సెమినార్లు, ఎగ్జిబిషన్ ఏర్పాట్లను ఈ బృందాలు పర్యవేక్షిస్తాయి. ఇతర దేశాల నుంచి వచ్చే అతిథులు, ముఖ్యమంత్రి సభా ప్రాంగణానికి చేరుకునేలా ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేశారు. అతిథులకు ఎంవీఎస్ మూర్తి ఆడిటోరియం రోడ్డు నుంచి సాధారణ పెట్టుబడిదారులకు, ఇతర అధికారులకు ఇంజినీరింగ్ కళాశాల వసతి గృహాల సముదాయాల వద్ద మెయిన్ గేటు ఏర్పాటు చేశారు. మెయిన్ గేటులో నుంచి లోపలికి వచ్చిన వారిని తనిఖీ చేసిన అనంతరం రిజస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహిస్తారు. అధికారులతో పాటు ఈవెంట్ మేనేజ్‌మెంట్లకు చెందిన ప్రైవేటు వ్యక్తులు కూడా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. కేపీఎంజీ, సీఐఐ, ఈడీబీ తదితర సంస్థలతో పాటు ట్రైమ్స్ నౌ సంస్థ కూడా ఏర్పాట్లలో భాగస్వామ్యం అయ్యాయి.

గ్యాస్ ధర పెంపుపై ప్రజాగ్రహం

- మోదీ సర్కారుకు వ్యతిరేకంగా హోరెత్తిన నిరసనలు
- పెంచిన ధర తగ్గించాల్సిందేనని మహిళా నేతల డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ ధర పెంచడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నిరసనలు హోరెత్తాయి. ఒక్కో వంట గ్యాస్‌పై రూ.50, వాణిజ్య సిలిండరుపై రూ.350 పెంచడాన్ని వ్యతిరేకిస్తూ అనేకచోట్ల సీపీఐ, మహిళా సమాఖ్య అధ్వర్యాన వివిధ రూపాల్లో ప్రజాగ్రహం వ్యక్తమైంది. కేంద్రంలోని మోదీ సర్కారు నిత్యావసర వస్తువుల ధరలను రోజురోజుకీ పెంచుతూ సామాన్య ప్రజల నడ్డి విరుస్తోందని నిరసనకారులు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు మిన్నంటాయి. నరేంద్ర మోదీ రెండోసారి ప్రధాని అయ్యాక వంట గ్యాస్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయని మండిపడ్డారు. పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తీవ్రస్థాయిలో ప్రజాగ్రహం చవిచూడక తప్పదని మహిళలు హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) అధ్వర్యంలో గ్యాస్ ధరల పెంపును వ్యతిరేకిస్తూ విజయవాడ లెనిన్ సెంటర్‌లో మహిళలు ఖాళీ సిలిండర్లతో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య జాతీయ నాయకురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ... గడచిన నాలుగు నెలల్లో మోదీ సర్కారు నాలుగు సార్లు గ్యాస్ ధర పెంచడంతో పేదలపై తీవ్ర ఆర్థిక భారం పడిందన్నారు. మోదీ సర్కారు పేదల జీవితాలతో చెలగాటమాడుతున్నదని ధ్వజమెత్తారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు రూ.400 ఉన్న గ్యాస్ ధర నేడు రూ.1155లకు చేరిందని, ఆఖరికి సబ్సిడీని కూడా పూర్తిగా ఎత్తేసిందన్నారు. భారతదేశాన్ని అమ్మకానికి పెట్టేందుకు మోదీ సర్కారు ఎదురు చూస్తోందని మండిపడ్డారు. కార్పొరేట్ సంస్థలకు రూ.12లక్షల కోట్ల మేర కేంద్రం ప్రభుత్వ రాయితీ ఇచ్చిందన్నారు. ఇదే రాయితీలు ఆహార భద్రత, వ్యవసాయం రంగానికి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. గ్యాస్, ఇతర నిత్యావసరాల ధరలు తగ్గించేంతవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గినప్పటికీ దేశంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ కేంద్రం పెంచుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరలను తగ్గించకపోతే బీజేపీ ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ దుర్గాభవానీ మాట్లాడుతూ... బీజేపీ అధికారంలోకి రాకముందు అప్పటి గ్యాస్ ధరలపై ఆ పార్టీ నాయకులు ధర్నాలు నిర్వహించారని గుర్తు చేశారు. బీజేపీ అధికారంలోకి రాకగానే అప్పట్లో ఉన్న గ్యాస్ ధరలను తగ్గిస్తామన్నారని, తీరా వారి పాలనలో రూ.400 ఉండాల్సిన గ్యాస్ రూ.1155 అయిందన్నారు. 2023 బడ్జెట్ పెట్టిన కొన్ని నెలలకే వంట గ్యాస్ రూ.50 పెంచడం సిగ్గుచేటన్నారు. మన రాష్ట్రంలో గ్యాస్ ఉత్పత్తిని కార్పొరేట్ సంస్థలకు అమ్ముకుంటున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా పాలన వదిలి, కార్పొరేట్ సంస్థలను పెంచిపోషిస్తున్నాయన్నారు. సామాన్యులు నిత్యావసర, గ్యాస్, పెట్రోల్, డీజిల్ వంటి ధరలను భరించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ధరలను తగ్గించేంత వరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యు అధ్యక్షురాలు వీ జయలక్ష్మీ, ఎన్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అత్తిలి విమల, ప్రధాన కార్యదర్శి పిడికిటి సంధ్యాకుమారి, నగర కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ, ఎ.పద్మావతి, పీ.రాణి, షేక్.బషీరున్నీసా, విజయ, సుబ్బలక్ష్మీ, రత్నకుమారి, సుమిత్రా, కృష్ణవేణి, లోవరత్నం, అత్తిలి బేబీ, నదియా తదితర మహిళా నేతలు పాల్గొన్నారు.

విశాఖలో సీపీఐ వినూత్న నిరసన

విశాలాంధ్ర-విశాఖ: కేంద్రం ప్రభుత్వం వంట గ్యాస్ ధరలను పెంచడాన్ని నిరసిస్తూ సీపీఐ విశాఖ సమితి అధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గురజాడ అప్పారావు విగ్రహం ముందు పార్టీ కార్యకర్తలు గ్యాస్ సిలిండర్లకు ఉరి వేసుకొన్నట్లు వినూత్న రీతిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు మాట్లాడుతూ... నిన్నటిదాకా గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధర రూ.1,105 ఉండగా, తాజా పెంపుదలతో రూ.1,155 అయ్యిందని, ఇంటికి వచ్చేసరికి రూ.1200 అవుతుందని అన్నారు. వాణిజ్య సిలిండర్ ధర రూ.2119.50కు ఎగబాకిందని, పెరిగిన గ్యాస్ ధరలు వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నిత్యావసర సరకుల ధరలు, ట్రూ అప్ ఎరుతో విద్యుత్ చార్జీ పెంపుతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు అల్లాడుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ శాసనసభ ఎన్నికలు ముగిసిన వెంటనే వంట గ్యాస్ ధరలు పెంచడం ప్రజలను దగా చెయ్యడమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీఎన్ క్షేత్రపాల్, ఎం.మన్మథరావు, జి.కాసులరెడ్డి, వై.రాంబాబు, ఎ.ఆదినారాయణ, ఎన్.అప్పన్న, యు.నాగరాజు, ఎం.శ్రీనివాసరావు, సీహెచ్. కాసుబాబు, సీహెచ్. బుజ్జి, తెడ్డు వెంకటేశ్వరరావు, సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్యాస్ ధర పెంపు దుర్మార్గం: జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-వినుకొండ: గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ సీపీఐ అధ్వర్యాన వినుకొండ శివయ్య స్తూపం సెంటర్లో ధర్నా జరిగింది. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని, సామాన్యులపై భారం మోపుతారా అంటూ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తూ కార్యకర్తలు నినాదాలు చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ... ఇప్పటికే నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే వంటగ్యాస్ సిలిండర్ ధరను 50 రూపాయలు పెంచడం దుర్మార్గం అన్నారు. పెరిగిన గ్యాస్ ధరలను తగ్గించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఏ మారుతీ వరప్రసాద్, సీపీఐ వినుకొండ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఉలవలపూడి రాము, జిల్లా కన్వీనర్ షేక్ సుభాని, వినుకొండ రూరల్ మండల సీపీఐ కార్యదర్శి బూదాల సాగర్, నూజెండ్ల మండల సీపీఐ కార్యదర్శి ఏ పవన్ కుమార్, బొల్లాపల్లి మండల కార్యదర్శి పిన్నెబోయిన వెంకటేశ్వర్లు ఏఐఎస్ఎఫ్ ఏరియా కార్యదర్శి పి. శశికుమార్, మస్తాన్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

భార్యను 11 ఏళ్లు బంధించిన న్యాయవాది

- చీకటి గదిలో చిక్కిశల్యమైన మహిళ
- సెర్చ్ వారెంట్‌తో విముక్తి కల్పించిన పోలీసులు

విశాలాంధ్ర-విజయనగరం క్రైమ్: న్యాయవాద వృత్తిలో ఉన్న ఓ న్యాయవాది ఆ వృత్తికే కళంకం తెచ్చాడు. తన తల్లి, సోదరుడు మాటలు విని ఏకంగా 11 సంవత్సరాల పాటు తాళి కట్టిన భార్యను ఇంట్లో బంధించి బయట ప్రపంచానికి దూరం చేశాడు. చీకటి గదిలో బక్క చిక్కిన శరీరంతో ఆమె 11 సంవత్సరాలుగా కఠినాతి కఠినమైన చీకటి జీవితాన్ని అనుభవించింది. తన న్యాయవాద వృత్తిని అడ్డం పెట్టుకొని బయట ప్రపంచానికి, తల్లిదండ్రులకు దూరంచేసిన ప్రబుద్ధుడు గోదావరి మధుసూదన్. ఈ ఘటనకు సంబంధించి ఒకటవ పట్టణ సీఐ బి.వెంకట్రావు తెలిపిన వివరాల ప్రకారం, శ్రీ సత్యసాయి పుట్టపర్తి జిల్లాకు చెందిన సాయి సుప్రియకు విజయనగరం పట్టణం కంటోన్మెంట్ బాలాజీ మార్కెట్ సమీపంలో ఉంటున్న గోదావరి మధుసూదన్‌తో 2008లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం కలిగిన అనంతరం న్యాయవాది మధుసూదన్ తన తల్లి గోదావరి ఉమామహేశ్వరితో పాటు తన తమ్ముడి మాటలు విని కట్టుకున్న భార్యను బయట ప్రపంచానికి దూరం చేస్తూ చీకటి గదిలో 11 సంవత్సరాలు పాటు బంధించాడు. బాధితురాలి కుటుంబ సభ్యులు ఎన్ని మార్లు అడిగిన న్యాయవాది తన వృత్తిని అడ్డం పెట్టుకొని బాధితురాలి కుటుంబ సభ్యులను బెదిరించేవాడు. దీంతో దిక్కుతోచని స్థితిలో తమ కుమార్తె ఏమైందో తెలియక వారు 11 సంవత్సరాలుగా నరకయాతన అనుభవించారు. సహనం కోల్పోయిన బాధితురాలి తల్లిదండ్రులు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో ఒకటవ పట్టణ పోలీసులు ఫిబ్రవరి 28న గోదావరి మధుసూదన్ ఇంటికి వెళ్లగా, మా ఇంటిని తనిఖీ చేసే అధికారం మీకు లేదు, తనిఖీ చేసేందుకు కోర్టు ఆదేశాలు ఏమైనా ఉన్నాయా అని పోలీసులు ఎదురు ప్రశ్నించారు. దీంతో పోలీసులు, బాధితురాలి తల్లిదండ్రులు న్యాయస్థానాన్ని ఆశ్రయించి సెర్చ్ వారెంట్ తీసుకువచ్చారు. సెర్చ్ వారెంట్‌తో బుధవారం పోలీసులు న్యాయవాది మధుసూదన్ ఇంటిని తనిఖీ చేయగా సాయిప్రియ బక్క చిక్కిన శరీరంతో చీకటి గదిలో దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తూ ఓ మూలన కనిపించింది. దీంతో పోలీసులు ఆమెను బయటకు తీసుకువచ్చి న్యాయస్థానంలో హాజరు పరిచారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు నిందితులపై చర్యలు తీసుకుంటామని ఒకటవ పట్టణ సీఐ వెంకటరావు తెలిపారు.

పారిశ్రామిక సదస్సుకు 25 దేశాల ప్రముఖులు

- శరవేగంగా ఏర్పాట్లు
- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ వెల్లడి

విశాలాంధ్రబ్యూరో-విశాఖపట్నం: విశాఖలో ఈ నెల 3, 4 తేదీల్లో జరగనున్న పారిశ్రామిక సదస్సు (గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్)కు 25 దేశాల నుంచి ప్రముఖులు తరలి వస్తున్నారని పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వెల్లడించారు. సదస్సు నిర్వహణకు సంబంధించి ఆంధ్ర యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో శరవేగంగా జరుగుతున్న ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఇప్పటివరకు 25 ప్రత్యేక విమానాలు విశాఖకు రాబోతున్నాయన్న సమాచారం అందిందని, 18 విమానాలను విశాఖ ఎయిర్‌పోర్ట్‌లో పార్క్ చేసే అవకాశం ఉందని, మిగిలిన విమానాలు రాజమండ్రి, విజయవాడ ప్రాంతాలకు తరలించనున్నామని చెప్పారు. విశాఖకు తరలివస్తున్న ప్రముఖుల్లో ముకేశ్ అంబానీ, కరణ్ అదాని, కుమార మంగళం బిర్లా తదితరులు ఉన్నారని తెలియజేశారు. అందరికీ విశాఖ నగరంలోని వివిధ హోటల్స్ లో బస ఏర్పాటు చేశామని చెప్పారు. నగరంలోని వివిధ హోటళ్లలో 600 గదుల వరకు సిద్ధంగా ఉన్నాయని ఆయన చెప్పారు. కాగా ఇప్పటివరకు సదస్సులో పాల్గొనేందుకు పదివేల మంది రిజిస్టర్ చేయించుకున్నారని మంత్రి అమర్‌నాథ్ చెప్పారు. గ్లోబల్ ఇన్వెస్టర్ సదస్సులో రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో అత్యధిక పెట్టుబడులు వచ్చే విధంగా ఉన్నాయని, ఇది రాష్ట్రంలో మేజర్ సెక్టర్ కాబోతోందని ఆయన అన్నారు. అలాగే పోర్టు ఆధారిత పరిశ్రమలు, ఫార్మా రంగాలకు ఉజ్వల భవిష్యత్తు ఉందని తెలిపారు. దేశంలో మరెక్కడా లేని రీతిలో 70 శాతం స్కిల్డ్ ఫోర్స్ ఏపీలో ఉందని తెలిపారు. విశాఖ నగరం రాష్ట్రానికి తలమానికంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

పటిష్ట భద్రత

ఇక నగరానికి తరలివస్తున్న ప్రముఖులకు కట్టుదిట్ట భద్రత కల్పిస్తున్నట్లు మంత్రి అమర్‌నాథ్ వెల్లడించారు. 11 సెక్టర్లలో నిఘా కెమెరాలను ఏర్పాటు చేశామని, డ్రోన్ కెమెరాలతో కూడా భద్రతను పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. సదస్సుకు హాజరయ్యే వారికోసం 25 ఎకరాలలో పార్కింగ్ సౌకర్యం కల్పించామని చెప్పారు. కాగా ప్రధాన వేదికపై సుమారు 50 మంది అతిథులు కూర్చుంటారని, ముందు భాగంలో 4వేల మంది ప్రతినిధులు కూర్చునే విధంగా ఏర్పాట్లు చేశామని ఆయన వివరించారు. సదస్సులో పాల్గొనేందుకు రిజిస్టర్ చేసుకున్న వారు రెండవ తేదీ ఉదయం 10 గంటల నుంచి సదస్సు జరిగే ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్లలో పాసులు తీసుకోవాలని ఆయన చెప్పారు. సభా ప్రాంగణంలో ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయని రెండవ తేదీ సాయంత్రానికి అంతా సిద్ధంగా ఉంటుందని ఆయన వివరించారు. ఇదిలా ఉండగా సదస్సుకు వచ్చే అతిథులకు స్థానిక ఎంజీఎం పార్కులో రెండవ తేదీ రాత్రి రాష్ట్ర ప్రభుత్వం విందు ఇవ్వనుంది. ఈ సందర్భంగా ఇక్కడ లేజర్ షో ప్రదర్శించనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, మంత్రి అమర్‌నాథ్ బుధవారం సాయంత్రం పరిశీలించారు.

నేడు ముఖ్యమంత్రి రాక

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం రాత్రి 8 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారని అమర్‌నాథ్ తెలియజేశారు. మూడవ తేదీ ఉదయం ఆయన వేదిక వద్దకు వచ్చి, ఎగ్జిబిషన్ ని తిలకిస్తారని, అనంతరం పారిశ్రామిక సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రసంగిస్తారని చెప్పారు. ఆ తర్వాత తొలి రోజు కొన్ని ఎంవోయూలు జరుగుతాయని మంత్రి వివరించారు. నాల్గవ తేదీన కూడా ఎంఓయూలు చేస్తారని ఆయన చెప్పారు. సీఎం జగన్‌పై నమ్మకంతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి అనేకమంది ముందుకు వస్తున్నారని అన్నారు. చేసుకున్న ఎంవోయులలో 90 శాతం వరకు గ్రౌండ్ అయ్యే అవకాశం ఉందని ఆయన చెప్పారు.

న్యాయవాదులకు అండగా ఐఏఎల్: చలసాని అజయ్

విశాలాంధ్ర - జగ్గయ్యపేట: న్యాయవాదుల సమస్యలు పరిష్కరించటంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్ (ఐఏఎల్) యూనియన్ ముందు ఉంటుందని అసోసియేషన్ జాతీయ కార్యదర్శి చలసాని అజయ్ కుమార్ అన్నారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో ఐఏఎల్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఐఏఎల్ ప్రధాన కార్యదర్శి, సీనియర్ న్యాయవాది జూనెబోయిన శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అజయ్ కుమార్ మాట్లాడుతూ 1972లో ఢిల్లీలో సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాదులు కృష్ణయ్య, దేశాయ్, చిన్నపరెడ్డి, పద్మనాభరెడ్డి, వేణుగోపాల్ తదితరుల ఆధ్వర్యంలో ఐఏఎల్ యూనియన్ ఏర్పాటైందన్నారు. అప్పటి నుంచి న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి ఎంతగానో కృషి చేసినట్లు చెప్పారు. ప్రజాస్వామ్య హక్కులను నేటి ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాపాడుకోవాలని సూచించారు. మన కోసమే కాకుండా ప్రజల కోసం కూడా మనం పడాలని పిలుపునిచ్చారు. కరోనా కాలంలో పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడ్డారని, ప్రభుత్వాలు వారిని నిర్లక్ష్యం చేశాయని, మనం కట్టే పన్నులలో ఒక శాతం కార్మికులకు ఇవ్వాలని చట్టం చెబుతుంటే ప్రభుత్వాలు దానిని ఆచరించడం లేదని అన్నారు. న్యాయవాదుల సమస్యలను తమ దృష్టికి తెవస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీనిచ్చారు. జగ్గయ్యపేట కోర్టు పరిధిలోని సమస్యల పరిష్కారానికి, న్యాయవాదుల సంక్షేమ నిధి కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి సుధాకర్ రాజు, సహాయ కార్యదర్శి వెంకటరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు షరీఫ్, జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు జగన్నాథరావు, అన్నే పాగ సుందరరావు, ప్రస్తుత అధ్యక్షులు యర్ర మాస్ ధనంజయ, న్యాయవాదులు ఆరేపల్లి వెంకటేశ్వర్లు, నాగరాజు, కిషోర్, గోపినాథ్, కాంతారావు, నందిగామ బార్ అసోసియేషన్ సభ్యులు కరీముల్లా మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులను వంచించిన జగన్

టీడీపీ శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అగ్రిగోల్డ్ బాధితులను సీఎం జగన్ నమ్మించి మోసగించారని టీడీపీ శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రతిపక్షంలో ఉండి అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకుంటామని కల్లబొల్లి కబుర్లు చెప్పిన జగన్, అధికారంలోకి వచ్చి నాలుగేళ్లవుతున్నా వారి సమస్యలను పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. అగ్రిగోల్డ్ బాధితుల గోడు వినే తీరిక కూడా ఆయనకు లేదా? అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం నియంతృత్వ ధోరణికి నిదర్శనమన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు టీడీపీ ప్రభుత్వం మేలు చేస్తే జగన్ వారిని గాలికొదిలేయడమే కాకుండా వారి ఆస్తులనూ అన్యాక్రాంతం చేశారని విమర్శించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అగ్రిగోల్డ్ ఆస్తులను సీజ్ చేసి బాధితులకు న్యాయం చేసేందుకు టీడీపీ ప్రభుత్వం రూ.336 కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయగా, జగన్ ఆ నిధులనూ దారి మళ్లించారన్నారు. జప్తు చేసిన అగ్రిగోల్డ్ ఆస్తులను విక్రయిస్తే రూ.35వేల కోట్లు వస్తాయని ప్రతిపక్షంలో ఊదరగొట్టిన జగన్, ఇప్పుడు ఆస్తుల వేలంపై ఎందుకు నోరుమెదపడం లేదని ప్రశ్నించారు. అగ్రిగోల్డ్ ఆస్తులను, హాయ్‌లాండ్‌ని తెలుగుదేశం పార్టీ నేతలు కొట్టేశారని విష ప్రచారం చేసిన జగన్, అధికారంలోకి వచ్చాక తన రాజకీయ ప్రయోజనాల కోసం అగ్రిగోల్డ్ బాధితులను పావుగా వాడుకున్నారు. అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి రూ.1,182 కోట్లు కేటాయిస్తానన్న జగన్ ఎందుకివ్వలేదని సాంబశివరావు డిమాండ్ చేశారు.

మహాధర్నాను జయప్రదం చేయండి

జంగాల అజయ్ కుమార్ పిలుపు

విశాలాంధ్ర-వినుకొండ: సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో విజయవాడలో గురువారం జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. టిడ్కో ఇళ్లలో మౌలిక వసతులు ఏర్పాటుచేసి లబ్ధిదారులకు వెంటనే అప్పగించాలని, జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని ఇసుక సిమెంటు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్‌తో ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. పల్నాడు జిల్లా వినుకొండలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడ్కో ఇళ్లను ఇప్పటి వరకు లబ్ధిదారులకు ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. పేద ప్రజలు ఇళ్లు వస్తాయన్న ఆశతో వడ్డీలకు అప్పులు తెచ్చి ప్రభుత్వానికి కట్టారని, వారి ఆశలు అవిరయ్యేలా వైసీపీ ప్రభుత్వ వైఖరి ఉన్నదన్నారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వకుండా కాలయాపన చేయడం వల్ల కంపచెట్లు పెరిగి శిథిలావస్థకు చేరుకున్నాయని అన్నారు. పట్టణాలలో బహుళ అంతస్తుల టిడ్కో భవన సముదాయాలు నిర్మించిన చోట రోడ్లు, మంచినీటి సదుపాయం, డ్రైనేజీ, పార్కు, ఆటస్థలం, విద్య, వైద్యం, వంటి వసతుల కల్పనలో జాప్యం జరుగుతోందన్నారు. సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ జగనన్న కాలనీల పేరుతో ఒక సెంటు స్థలాన్ని ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం 1,80,000 రూపాయలను మాత్రమే నిర్మాణానికి ఇస్తామంటోంది. అది ఇంటి నిర్మాణానికి ఏ మాత్రం సరిపోదు. ఇదే విషయంలో సీపీఐ అనేక ఉద్యమాలు చేసింది. సిమెంటు, స్టీల్, ఇటుక,కంకర, కిటికీలు ,తలుపుల ధరలు పెరగడంతో పాటుగా కూలీల ఖర్చు భారీగా పెరగడంతో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇచ్చి, ఇసుక, సిమెంటు ఉచితంగా ఇవ్వాలి. టిడ్కో ఇళ్లనూ లబ్ధిదారులకు వెంటనే కేటాయించాలి అని డిమాండ్ చేశారు. మహాధర్నా విజయవంతం కావాలని, టిడ్కో ఇళ్లు- జగనన్న కాలనీల లబ్ధిదారులు ఎక్కువమంది పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ వినుకొండ నియోజకవర్గ కార్యదర్శి బుదాల శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఉలవలపూడి రాము, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ షేక్ సుభానీతో పాటు స్థానిక నేతలు బూదాల సాగర్, పవన్ కుమార్, బొల్లాపల్లి మండల పిన్నెబొయిన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నూతన దంపతులకు జగన్ ఆశీస్సులు

విశాలాంధ్ర - నిడదవోలు: ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు, సుమలత దంపతుల కుమార్తె డాక్టర్ సౌమ్యశ్రీ వివాహ వేడుకల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాల్గొన్నారు. బుధవారం నిడదవోలులో జరిగిన రిసెప్షన్‌లో వధూవరులు సౌమ్యశ్రీ, వెంకట శివతేజను సీఎం ఆశీర్వదించారు. ఆయన ఉదయం 11గంటలకు వివాహ వేదికకు చేరుకొన్నారు. దాదాపు 15 నిమిషాలు అక్కడ గడిపారు. అనంతరం తాడేపల్లికి పయనమయ్యారు. ఈ వేడుకకు ప్రముఖ నేతలు హాజరయ్యారు.

ఎస్సీ హాస్టల్ ఉద్యోగుల వేతన సమస్య పరిష్కరించాం

మంత్రి మేరుగు నాగార్జున

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పోస్ట్ మెట్రిక్ ఎస్సీ హాస్టళ్లలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతన సమస్య పరిష్కారమైందని, ఇకపై వారికి సకాలంలో జీతాలు లభిస్తాయని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున వెల్లడించారు. ఈ మేరకు ఓ ప్రకటనను ఆయన బుధవారం విడుదల చేశారు. ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్(ఆప్కాస్)కు ఉద్యోగుల సేవలను అనుసంధానం చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని 160 పోస్ట్ మెట్రిక్ ఎస్సీ హాస్టళ్లలో వంట, పారిశుద్ధ్య ఉద్యోగులలో 411 మందికి ప్రైవేటు సంస్థలు వేతనాలు చెల్లించేవారన్నారు. సకాలంలో వేతనాలు అందక ఉద్యోగాలను చాలా మంది మానేసినట్లు తెలిపారు. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్న పరిస్థితుల్లోనే ఉద్యోగుల సమస్య తన దృష్టికి వచ్చిందన్నారు. శాశ్వత పరిష్కారాన్ని చూపగలిగామన్నారు. థర్డ్ పార్టీ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రీమెట్రిక్ ఎస్సీ హాస్టళ్లలో ఇదివరకే మంజూరైన పోస్టులలో ఉపయోగించుకోవాలని, వేతనాలను ఆప్కాస్ ద్వారా సకాలంలో చెల్లించాలని సూచించినట్లు తెలిపారు. ఆప్కాస్‌కు అనుసంధానం చేసిన ఉద్యోగులలో 37 మంది శ్రీకాకుళం, విజయనగరం-52, విశాఖపట్నం-17, తూర్పుగోదావరి-120, 82 మందిని కృష్ణా-82, ప్రకాశం-62, అనంతపురం-41 మంది చొప్పున ఉన్నట్లు మంత్రి వెల్లడించారు.

మేమొస్తాం... కంపెనీలు-ఉద్యోగాలు తెస్తాం

యువగళం పాదయాత్రలో లోకేశ్

విశాలాంధ్ర పాకాల: రాష్ట్రంలో అధికారంలో వస్తామని, అనేక కంపెనీలను తెస్తామని, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని యువగళం పాదయాత్రలో యువతకు టీడీపీ ఆ/జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హామీనిచ్చారు. వైసీపీ పాలనలో రాష్ట్ర యువత భవిష్యత్తు అంధకారమైందని, టీడీపీ హయాంలో వచ్చిన కంపెనీలన్నీ జగన్ సీఎం అయ్యాక రాష్ట్రాన్ని విడిచి వెళ్లాయని వ్యాఖ్యానించారు. బుధవారం పాకాల మండలంలోని గాదంకి నేంద్రగుంట, ఇరంగారిపల్లి, పాకాల, ఉప్పరపల్లి గ్రామ పంచాయతీలలో పాదయాత్ర సాగింది. ఇరంగారి పల్లి వద్ద ఇంజనీరింగ్ విద్యార్థులతో లోకేశ్ మాట్లాడుతూ యువత భవిష్యత్తు కోసం ఆలోచించి ఉద్యోగ కల్పన కోసం టీడీపీ అనేక కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు గుర్తుచేశారు. జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఆ కంపెనీలను తరిమివేశారన్నారు. దీంతో కొన్ని లక్షల ఉద్యోగావకాశాలు చేజారినట్లు తెలిపారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు విచ్చలవిడిగా అమ్ముతూ యువతను వాటికి బానిసలుగా మార్చి వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారన్నారు. అనంతరం టైలర్లతో, పూల వ్యాపారులు, లాయర్లతో లోకేశ్ మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. ఆయన వెంట టీడీపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి పులివర్తి నాని ఉన్నారు.

రాష్ట్రాభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం: గిడుగు రుద్రరాజు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సమాజంలోని అన్ని వర్గాల ఉన్నతితో కూడిన రాష్ట్రాభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యమని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఉద్ఘాటించారు. బుధవారం విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఫిబ్రవరి 24 నుంచి 26వ తేదీ వరకు ఛత్తీస్‌గఢ్‌లోని నయా రాయ్‌పూర్‌లో జరిగిన ఏఐసీసీ 85వ ప్లీనరీ సమావేశంలో ఆమోదించిన ఆరు తీర్మానాలను వివరించారు. కాంగ్రెస్ అధికార సమయంలో నాటి ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ నేతృత్వంలో పార్లమెంటులో రూపొందించిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014ను, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ఏ ప్రభుత్వమైనా ఆమోదించాల్సి ఉంటుందని తెలిపారు. కేంద్రంలో అధికారంలోనికి వచ్చిన మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసి ప్రత్యేక హోదా నిరాకరించడం దారుణమని అన్నారు.

సంపాదకీయం

నిర్ణయాల కంటే ఆచరణ ముఖ్యం

దశాబ్ద కాలంలో కాంగ్రెస్ చాలా బలహీనపడింది. గత వారం జరిగిన కాంగ్రెస్ 85 ప్లీనరీ సమావేశంలో చేసిన తీర్మానం, డిక్లరేషన్‌లో పేర్కొన్నఅంశాలు వివిధతరగతుల ప్రజలను ఆకట్టుకునే లాగా ఉన్నాయి. అన్నిటికంటే కాంగ్రెస్‌ను తిరిగి పునరుజ్జీవింప చేసేందుకు కృషి చేయాలన్న ధృడ సంకల్పం ఆ పార్టీలో మార్పును సూచిస్తోంది. రాహుల్‌గాంధీ జోడోయాత్రకు అనంతర కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం కనిపిస్తోంది.2023 లో ముఖ్యమైన రాష్ట్రాలకు, 2024 లో జరగనున్న ఎన్నికల్లో గెలవడానికి ఇతర పార్టీలతో పొత్తులు పెట్టుకొనేందుకు సిద్ధపడాలన్న నిర్ణయం లాంటివి కీలక అంశాలు. కాంగ్రెస్ పటిష్ఠత, 2024 లోక్‌సభ ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలన్న సంకల్పం ప్రధానమైనవి. లోక్‌సభ ఎన్నికల్లో భావ సారూప్యత గల పార్టీలతో పొత్తులని పేర్కొన్నారేగాని ఐక్య ఫ్రంట్ ఏర్పాటు, ఆచరణాత్మక ఉమ్మడి కార్యాచరణ లాంటి నిర్ణయాలు డిక్లరేషన్‌లో స్పష్టంగాలేవు. తీవ్రంగా బలహీనపడిన పార్టీని క్షేత్రస్థాయి నుండి బలోపేతం చేయవలసి ఉంటుంది. అయితే అందుకు కావలసిన పరిస్థితులు ఉన్నాయా లేదా అన్నది ముఖ్యం. పార్టీ నుండి వివిధ కారణాలతో చాలామంది సీనియర్ నాయకులు బయటికి వెళ్లిపోయారు. ఇంకా చాలామంది కాంగ్రెస్ పెద్దలపై వచ్చిన అవినీతిపరులన్న ఆరోపణల కేసులు కొనసాగుతూనే ఉన్నాయి. వెళ్లిపోయిన మంచి అనుభవం ఉన్న నాయకులను తిరిగి పార్టీలోకి రప్పించి ఆయారాష్ట్రాల్లో పార్టీ పరిస్థితులను మెరుగుపరుచుకోవలసి ఉంటుంది. రాహుల్ జోడోయాత్రలో తమ పరిస్థితులు బాగా మెరుగయ్యాయన్న నమ్మకం పార్టీ కార్యకర్తల్లో ఏర్పడిన మాట వాస్తవమే. అలాగే జోడోయాత్రలో వివిధవర్గాల ప్రజల్లో సాను కూలత కలిగింది. ఈ సానుకూలతను ఓట్లుగా మార్చుకొనే పరిస్థితులు క్షేత్రస్థాయిలో లేవు. అదే సమయంలో మెజారిటీ ప్రజలను వాగ్దానాలతో మత భావజాలాల్ని దశాబ్దాలుగా, బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నూరిపోసిన సంఘ పరివార్ కార్యకర్తలు లక్షలాది మంది దేశమంతటా విస్తరించి బలంగా ఉన్నారు. ప్రతి ఎన్నికలో వీరు సర్వశక్తులు ఒడ్డి, అబద్ధాలను ప్రచారం చేస్తూ ఓట్లు వేయించుకోగలుతున్నారు. కాంగ్రెస్ కింది స్థాయిలో సుశిక్షణ గల కార్యకర్తలను తయారుచేసుకోవడం సామాన్య మైన విషయం కాదు. రాహుల్ జోడో యాత్ర ద్వారా విజ్ఞత గల రాజకీయవేత్తగా మెలగగలిగిన సత్తాను సాధించకోగలిగారు. యాత్రలో ఎంతో అనుభవం గల నాయకుడిగా ఎదిగారు. ఆర్ఎస్ఎస్, బీజేపీల ఈర్ష్యా, ద్వేషాలను పెంచి పోషిస్తుండగా తాను ప్రజల్లో ప్రేమను, శాంతిని సాధించడానికి ప్రయత్నిస్తున్నానని చెప్పిన విషయం ప్రజలను ఆకర్షించింది. రాజకీయ యాత్ర కాదని చెప్పినప్పటికీ పార్టీకి సహాయపడు తుందనేది వాస్తవం. రాహుల్ ఒక సిద్ధాంత రూపకల్పన మార్గాన్ని వెతుక్కుంటున్నాడు. అయితే ఈ లక్ష్యాన్ని ఏ మేరకు సాధించగలడన్నది చూడాలి. మోదీ సామాజిక విభజన సృష్టించి హిందూ మతం ప్రమాదంలో ఉందన్న భావనను మెజారిటీ ప్రజల్లో కలగజేసి గెలిచాడు. దీన్ని ఢీ కొట్టగలిగిన సైద్ధాంతిక మార్గనిర్ధేశం ఉండాలి. అది మెజారిటీ మత అనుకూల సిద్ధాంతం కాకూడదు. అదే అయితే పార్టీకి దూరమైన కోట్లాది ప్రజలను ఆకట్టుకొనే అవకాశం ఉండదు. బహు భాషల ప్రజలను, బహుళత్వాన్ని, దేశ పౌరులంతా ఒకటేనన్న అభిప్రాయాన్ని ఏర్పరచగల సెక్యులర్ మార్గం మాత్రమే అయి ఉండాలి. అధికారంలో ఉన్న మోదీ గత తొమ్మిదేళ్లుగా అనుసరిస్తున్న దేశ ప్రజలంతా ఒకటి కాదన్న మత మితవాదసిద్ధాంతాన్ని ఢీ కొట్ట గలిగిన సిద్ధాంతమై ఉండాలి. పార్టీకి ఈ లక్ష్యం సాధించగల శక్తి ఉందా అన్నదే పెద్ద ప్రశ్న.

మోదీని ఢీకొని విజయం సాధించాలంటే ప్రతిపక్షాలన్నీ ఒక్క తాటిపైకి రావాలి. ఈ లక్ష్యం సాధించటం అంత తేలికైన విషయం కాదు. ప్రతి పక్షాలను చెల్లాచెదురు చేయగల మాయోపాయాలను, కుట్రపూరిత ఎత్తుగడలను వేయడంలో మోదీ, అమిత్‌షా ఆరితేరారు. ఇప్పటి కాంగ్రెస్‌కు దూరంగా ఉన్న ప్రాంతీయ పార్టీలు ఉన్నాయి. ముఖ్యంగా తెలంగాణలో బిఆర్ఎస్, ఆంధ్రాలో టి.డి.పి, వై.సి.పి, ఢిల్లీలో ఆప్, పశ్చిమబెంగాల్‌లో టి.ఎం.సిలు ఉన్నాయి. వీటిలో ఆప్, టిఎంసి, బిఆర్ఎస్‌లు బీజేపీని గట్టిగా వ్యతిరేకిస్తున్నాయి. యుపిలో బిఎస్‌పి, సమాజ్‌వాదీ పార్టీలు కాంగ్రెస్‌కు దూరంగానే ఉన్నాయి. ఇక ముస్లిం మజ్లిస్, బిఎస్‌పిలు బీజేపీని వ్యతిరేకిస్తు న్నాయని చెప్పినప్పటికీ కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉండవన్న అభిప్రాయం బలంగా ఉంది. కాంగ్రెస్‌తో కలిసి రావడానికి 16 చిన్నా పెద్ద పార్టీలున్నాయని చెప్తున్నారు. కర్నాటకలో జెడిఎస్ నిర్దిష్టమైన నిర్ణయం తీసుకోలేదు. దేశ వ్యాప్తంగా ఎంతో కొంత బలం గల జాతీయ పార్టీ కాంగ్రెస్ ఒక్కటే. వామపక్షాలు బలహీనపడి కొన్ని రాష్ట్రాలకు పరిమితమైన జాతీయపార్టీలు. కాంగ్రెస్ ప్రతిపక్షాలన్నిటికీ నాయకత్వం వహించాలని నితీశ్‌కుమార్, లాలూప్రసాద్, శరద్‌పవార్ లాంటి వారు ఇప్పటికే చాలాసార్లు తమ అభిప్రాయం చెప్పారు. మొత్తం ప్రతిపక్షాలు ఒక్కటయితే, విజయం తప్పక సాధ్యమవుతుందని నితీశ్ తదితరులు విశ్లేషించారు. నితీశ్ రంగంలోకి దిగడానికి సిద్ధంగా ఉన్నారు. ఆయనను అప్రతిష్ట పాలు చేసేందుకు బీజేపీ కసరత్తు చేస్తోంది. కాంగ్రెస్ అంతర్గత కలహాలను ముందుగా పరిష్కరించుకోవాలి. ఆ తర్వాత ప్రతిపక్ష ఫ్రంట్ రూపకల్పన లోనూ కాంగ్రెస్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నట్లయితే అసలుకే మోసమొస్తుంది. వివిధ రాష్ట్రాల్లో క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. బెంగాల్‌లో టిఎంసి అధికారంలో ఉన్నందున కాంగ్రెస్, వామపక్షాలతో సర్దుబాట్లకు అంగీకరించదు. చాలా రాష్ట్రాలలో వలె ఆంధ్రలో కాంగ్రెస్ బలహీనమైంది. పార్టీని నడిపించగల చాకచక్యంగల నాయకుడు కనిపించడు. తెలంగాణలో అంతర్గత ముఠాలు ఎక్కువ. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకొని ముందుగా అంతర్గత సమస్యలు పరిస్కరించుకొని ప్రతిపక్షాల ఐక్యతపై స్పష్టత తెచ్చుకోవాలి. ఇతర పార్టీలను ఒప్పించ గల సామర్థ్యాన్ని కలిగి ఉండాలి. ఇవి ఉన్నాయని నిరూపించుకోవాలి. మొత్తం ప్రతిపక్షాలన్నిటిని ఫ్రంట్‌గా ఏర్పాటుచేసి ప్రజలు విశ్వసించగల ఆచరణాత్మక ఉమ్మడి కార్యక్రమాన్ని రూపొం దించడం అవసరం. అలాగే స్థానిక పరిస్థితులను బట్టి కాంగ్రెస్‌తో సహా అన్ని ప్రతిపక్షాలు సర్దుబాట్లు, త్యాగాలు చేయాలి. అప్పుడు మాత్రమే విజయం సాధ్యం అవుతుంది. ఎవరికి వారు ప్రధానమంత్రి పదవిని ఆశిస్తున్న నాయకులున్నారు. కాంగ్రెస్ భిన్నమైన నిర్ణయం తీసుకొని ఎన్నికల ఫలితాల అనంతరం పొత్తులు అనుకుంటే బీజేపీ ధనరాసులు, మాయో పాయాలు పనిచేస్తాయి. సార్వత్రిక ఎన్నికలకు ఏడాది ఉండగా ప్రతిపక్ష నాయకులపై అవినీతి ఆరోపణలు చేసి కేసులు బనాయించి అప్రతిష్ఠపాలు చేసే యుద్ధాన్ని రానున్న నెలల్లో మరింతగా పెరగవచ్చు. ప్రతిపక్షం ఐక్యతే వీటిని సమర్థంగా ఎదుర్కోగలదు.

విద్యుత్ ధరలకు రెక్కలు

రానున్న నెలల్లో యూనిట్‌కు 50 రూపాయలకు విద్యుత్ అమ్ముకునే స్వతంత్ర తను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఇచ్చింది.దిగుమతి చేసుకున్న బొగ్గు సహజ వాయువు లేదా నాఫ్తా ఉపయోగించి విద్యుత్ ఉత్పత్తి చేసే కంపెనీలు యూనిట్‌కు 50 రూపాయల వరకు విద్యుత్‌ను విక్రయించడానికి అనుమతించారు. దిగుమతి చేసుకున్న 15 బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్లలో గుజరాత్‌లోని ముంద్రాలో టాటా పవర్ అదానీ పవర్ ప్లాంట్లు ఉన్నాయి. సలయలో ఎస్సార్ పవర్ ప్లాంట్ జె ఎస్ డబుల్యూ రత్నగిరి టాటా ట్రాంబే ఉడిపి పవర్ మీనాక్షి ఎనర్జీ జె ఎస్ డబ్ల్యూ వరంగల్లులో ప్లాంట్ల మొత్తం ఉత్పత్తి సామర్థ్యం 17,600 మెగావాట్లు. సహజ వాయువు ఆధారిత విద్యుత్ ప్లాంట్ల మొత్తం సామర్థ్యం 25,000 మెగావాట్లు.

గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా వేసవి కాలం సమీపిస్తున్న తరుణంలో కరెంటు కష్టాలు తప్పడం లేదు. పంజాబ్‌లోని రైతులు తమ పొలాలకు నీరందించడానికి తమకు కావలసినప్పుడు కరెంటు రావడం లేదని ఇప్పటికే ఫిర్యాదు చేస్తున్నారు. ఏప్రిల్ 2023 నాటికి విద్యుత్ అవసరాలు దాదాపు 2,00,000 మెగావాట్ల నుండి 2,30,000 మెగా వాట్లకు అంటే 15% పెరుగుతాయని ప్రభుత్వ సొంత అంచనాలు చూపిస్తున్నాయి.వేసవిలో విద్యుత్ సరఫరాలో లోటును నివారించేందుకు మార్చి16 నుంచి జూన్15 వరకు పూర్తి సామర్థ్యంతో నడపాలని విద్యుత్ మంత్రిత్వ శాఖ ఇప్పటికే 15 దిగుమతి చేసుకున్న బొగ్గు ఆధారిత ప్లాంట్ లను కోరింది.ఈ ప్లాంట్లు చాలా తక్కువ సామర్థ్యంతో పనిచేస్తున్నాయి, దిగుమతి చేసుకున్న బొగ్గు అధిక ధర కారణంగా ఉత్పత్తికి అధిక వ్యయం కారణమవుతుంది. ప్రభుత్వ యాజమాన్యంలోని పంపిణీ సంస్థలతో దీర్ఘకాలిక స్థిర ధరల సరఫరా ఒప్పందాలను కుదుర్చుకున్నందున వారు పూర్తి సామర్థ్యంతో అమలు చేయడానికి నిరాకరించారు.

గతేడాది కరెంటుకొరత ఏర్పడినప్పుడు విద్యుత్‌ను ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్ (IEX)లో యూనిట్‌కు 20. IEX అనేది ప్రతిరోజూ శక్తిని విక్రయించే కొనుగోలు చేసే వేదిక సరఫరా డిమాండ్ ఆధారంగా ధరలు నిర్ణయిస్తారు. విద్యుత్ సంస్థల లాభదాయకతకు వ్యతిరేకంగా నిరసనలు ప్రభుత్వం IEX లో విక్రయించే గరిష్టధర విద్యుత్‌ను రూ.12గా నిర్ణయించ వలసి వచ్చింది. ఇప్పుడు ధరల పరిమితిని రూ.50కి పెంచడం ద్వారా, విద్యుత్ కొరతను పూర్తిగా ఉపయోగించుకోవడానికి, వినియోగదారుని దోపిడీ చేయడానికి ప్రభుత్వం ఈ విద్యుత్ కంపెనీలకు స్వేచ్ఛనిచ్చింది.విద్యుత్ మంత్రిత్వ శాఖ కూడా (జనవరి 9, 2023న) ప్రభుత్వ యాజమాన్యంలోని అలాగే ప్రైవేట్ థర్మల్ పవర్ ప్లాంట్‌లకు బొగ్గు కొరతను తీర్చడానికి దేశీయ బొగ్గుతో ఆరు శాతం చొప్పున కలపడానికి బొగ్గును దిగుమతి చేసుకోవాలని ఆదేశించింది. ఇది ఇతర దేశాలలో బొగ్గుగనులను కలిగిఉన్న అదానీ టాటా వంటి పెద్ద భారతీయ కార్పొరేట్ గ్రూపులకు మళ్లీ ప్రయోజనం చేకూరుస్తుంది.అదానీ గ్రూప్ ఇండోనేషియా, ఆస్ట్రేలియా భారతదేశం అంతటా 50 మిలియన్ టన్నుల కంటే ఎక్కువ కెపాసిటీ కలిగిన బొగ్గు గనులను కలిగి ఉంది, ప్రపంచ మార్కెట్‌లలో విక్రయించడానికి మరియు అదానీ సొంత పవర్ స్టేషన్‌లలో ఉపయోగించేందుకు ఇంధనాన్ని ఉత్పత్తి చేస్తుంది.గత సంవత్సరం కూడా, విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన బొగ్గు అవసరాలను భర్తీ చేయడానికి ప్రభుత్వం విద్యుత్‌ప్లాంట్లను బొగ్గుదిగుమతి చేసుకోవాలని ఒత్తిడి చేసింది. దిగుమతి చేసుకున్న బొగ్గు వినియోగం వల్ల లేదా IEX వద్ద అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేయడం వల్ల విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన అన్ని అదనపు ఖర్చులు వినియోగదారుల నుండి వసూలు చేస్తారు.

ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద బొగ్గు నిల్వలు భారత్‌లో ఉన్నప్పుడు విద్యుత్ ఉత్పత్తికి ఏటా బొగ్గు కొరత ఎందుకు ఏర్పడాలి. దేశంలో అత్యధికంగా బొగ్గును రెండు ప్రభుత్వ రంగ సంస్థలు - కోల్ ఇండియా సింగరేణి కాలరీస్ ఉత్పత్తి చేస్తున్నాయి. కొత్త బొగ్గు గనులను అభివృద్ధి చేయడం బొగ్గు ఉత్పత్తి చేయడంలో ఈ రెండు కంపెనీలకు గొప్ప అనుభవం ఉంది. వారిని ప్రోత్సహించి, వారి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి వనరులను అందించడానికి బదులుగా, ప్రభుత్వాల తర్వాత ప్రభుత్వాలు ప్రైవేట్ బొగ్గు గనుల అభివృద్ధి ఉత్పత్తిపై దృష్టి సారించాయి. కోల్ ఇండియా సింగరేణి కాలరీస్ రెండూ తమ బొగ్గు బ్లాకులను ప్రైవేట్ మైనింగ్ కోసం అప్పగించాలని కోరారు. కొత్త బొగ్గు గనులను అభివృద్ధి చేయడం దాని బొగ్గు ఉత్పత్తిని వేగంగా పెంపొందించడంలో పెట్టుబడి పెట్టడానికిబదులుగా ఎరువుల ఉత్పత్తి పునరుత్పాదక ఇంధన అభివృద్ధిలో పెట్టుబడి పెట్టాలని కోల్ ఇండియాను కోరింది.గనుల నుంచి విద్యుత్ ప్లాంట్లకు బొగ్గు రవాణా చేసే సామర్థ్యాన్ని కూడా రైల్వేలు పెంచుకోవాలి. రైల్వేల విషయంలో కూడా, సరుకు రవాణాతో సహా వివిధ కార్య కలాపాలను ప్రైవేటీకరించే మార్గాలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిశీలిస్తోంది. పెరిగిన విద్యుత్ రేట్ల ద్వారా ప్రైవేటీకరణ విధానం వల్ల దేశ ప్రజలు ఇప్పటికే భారీ మూల్యం చెల్లించుకుంటున్నారు. ప్రైవేటీ కరణ విధానాన్ని ప్రజలు వ్యతిరేకించకపోతే రాబోయే సంవత్సరాల్లో ఈ భారం మరింత పెరుగుతుంది.

ఆళవందార్ వేణు మాధవ్, 8686051752,

ప్రతిపక్షాన్ని అప్రతిష్ఠపాలు చేసే కుట్ర

డా॥ జ్ఞాన్ పాఠక్

క్రీడా పోటీల్లో ప్రత్యర్థి టీములు ఒకదానిపై ఒకటి గెలిచేందుకు సాధారణంగా రకరకాల వ్యూహాలు పన్నుతుంటాయి. అయితే రాజకీయాల్లో కేవలం ఇలాంటి వ్యూహాలు ఉపయోగపడవని మోదీ-అమిత్‌షా ద్వయం కుట్రపూరిత వ్యూహాలు, ఎత్తుగడలు పన్నడం సాదారణమైపోతోంది. 2023లో చాలా రాష్ట్రాల అసెంబ్లీలకు, 2024 లో లోక్‌సభకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలిచేందుకు ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాలు కుట్రపూరిత వ్యూహాలే పన్నుతున్నారు. ముందుగా ప్రతిపక్షాలను అప్రతిష్ఠపాలు చేసేందుకు ఈ వ్యూహాలను ప్రయోగించనున్నారు. మరిన్ని ఆర్థిక వనరులను నిల్వ చేసుకోవటం, ప్రతిపక్ష నాయకులపై కేసులు బనాయించి అరెస్టులు చేయించటం ఆయా రాజకీయ పార్టీల మధ్య విభేదాలు సృష్టించటం లాంటి వ్యూహాలను అమలు చేస్తున్నారు. ఈ అంశాలపై నిపుణులు రెండు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది మోదీ-షా ద్వయం వ్యూహం 2024 సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ బీజేపీకి అధికారాన్ని కట్టబెడుతుందని చెప్తున్నారు. మరికొందరు వీరిద్దరి వ్యూహాలను నిలువరించేందుకు ప్రతిపక్షమంతా ఒక్కటవుతుందని వీరిద్దరిని విలన్‌లుగా ప్రజలకు వివరించి చివరికి బీజేపీ పాలనకు చరమగీతం పాడుతుందని అంచనా వేస్తున్నారు. ఈ రెండు అభిప్రాయాల్లో ఏది నిజమవుతుందనేది కాలమే చెప్పగలదు.

ఈ సంవత్సరం 9 రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరుగుతాయి. ఈ ఎన్నికలు 2024 లో జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు సెమీ ఫైనల్‌గా భావిస్తున్నారు. అసెంబ్లీల ఎన్నికల ఫలితాలు భిన్నంగా కూడ ఉండవచ్చు. ఏమైనా ఈ ఎన్నికలు భారతదేశ చరిత్రలో అత్యంత కీలకమైనవిగా ఉండనున్నాయి. అంతేకాదు భారతదేశ భవిష్యత్ స్వరూపాన్ని నిర్ణయించేవిగా కూడ ఉంటాయి. దేశం ఫెడరల్, సెక్యులర్ రాజ్యంగా మిగులుతుందా! లేక నియంతృత్వ దేశంగా మారుతుందా! అన్న విషయాలను తెలియజేస్తాయి. గత తొమ్మిదేళ్ల మోదీ పాలనలో దర్యాప్తు సంస్థల ద్వారా అనేకమంది ప్రతిపక్ష నాయకులను, మేధావులను అరెస్టు చేయించి జైళ్లలో పెట్టారు. ఆయా రాజకీయ పార్టీల మధ్య తంపులు పెట్టి చీల్చారు. రాజకీయ పార్టీల ఆర్థిక శక్తిస్థోమతలను గణనీయంగా బలహీన పర్చారు. ఎన్నికల బాండ్లను ప్రవేశపెట్టి ప్రతిపక్షాల ఆర్థిక వనరుల సమీకరణ మీద చావుదెబ్బ కొట్టారు. బాండ్ల ద్వార బీజేపీ మాత్రం వేలకోట్ల రూపాయలను సమీకరిస్తోంది. ఇవే కాకుండా రహస్య విరాళాలు అపారంగా వచ్చి చేరుతున్నాయి. సమకాలీన రాజకీయాలలో ప్రతిపక్షాన్ని దెబ్బకొట్టే కొత్త వ్యూహం ఇది. ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసే వారిలో అత్యధికులు నల్లధనులే. నల్ల ధనాన్ని నిర్మూలిస్తాననే మోదీ పలికిన బీరాలన్నీ ఈ పథకం ద్వార డొల్లని తేలింది. ఈ పథకాన్ని ప్రతిపక్షం ఐక్యంగా వ్యతిరేకించి బీజేపీ ఎత్తుగడలను తిప్పి కొట్టలేకపోయింది.

దిల్లీ ఆప్ ప్రభుత్వ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా రూపొందించిన ఎక్సైజ్ విధానం ద్వారా అవినీతికి పాల్పడ్డాడన్న ఆరోపణతో ఫిబ్రవరి 26 న సిబిఐ అరెస్టు చేసింది. ఈ విషయంలో ప్రతిపక్షం కలిసికట్టుగా ప్రతిఘటించవలసి ఉన్నప్పటికీ అలాంటి యత్నం జరగలేదని కొందరు రాజకీయ నాయకులు వ్యాఖ్యానించారు. కేవలం అరెస్టును మాత్రమే ఖండించారు. ఖండిస్తూ మాట్లాడటం, ప్రకటనలు చేయటం వల్ల ప్రతిక్షం అంతా ఒకటిగా నిలిచిందన్న అభిప్రాయానికి ప్రజలు వచ్చే అవకాశమే ఉండదు. ఇలాంటి సంఘటనలను ఇప్పటికైనా గుర్తించి ప్రతిపక్షం ఒక్కతాటిపైకి వచ్చి అసెంబ్లీలకు, లోక్‌సభకు జరగనున్న ఎన్నికలను ఎదుర్కోవాలి.

దిల్లీ ఆప్ ప్రభుత్వ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా రూపొం దించిన ఎక్సైజ్ విధానం ద్వార అవినీతికి పాల్పడ్డాడన్న ఆరోపణతో ఫిబ్రవరి 26 న సిబిఐ అరెస్టు చేసింది. ఈ విషయంలో ప్రతిపక్షం కలిసికట్టుగా ప్రతిఘటించవలసి ఉన్నప్పటికీ అలాంటి యత్నం జరగలేదని కొందరు రాజకీయ నాయకులు వ్యాఖ్యానించారు. కేవలం అరెస్టును మాత్రమే ఖండించారు. ఖండిస్తూ మాట్లాడటం, ప్రకటనలు చేయటం వల్ల ప్రతిక్షం అంతా ఒకటిగా నిలిచిందన్న అభిప్రాయానికి ప్రజలు వచ్చే అవకాశమే ఉండదు. ఇలాంటి సంఘటనలను ఇప్పటికైనా గుర్తించి ప్రతిపక్షం ఒక్కతాటిపైకి వచ్చి అసెంబ్లీలకు, లోక్‌సభకు జరగనున్న ఎన్నికలను ఎదుర్కోవాలి. సీబీఐ ద్వార సిసోడియాను అరెస్టు చేయించటమే కాక చత్తీస్‌ఘర్‌లో జరిగిన కాంగ్రెస్ ప్లీనరీ సమావేశాల నిర్వాహకులను బెదిరించినట్లు వార్తలు అందాయి. ప్లీనరీకి విరాళాలు ఇచ్చి సహకరించిన వ్యాపారవేత్తలపై దాడులు జరిపి బీజేపీ ప్రభుత్వం హద్దులు దాటిందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేశ్ భగల్ తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్లీనరీ సమావేశాలు జరగకుండా భయోత్పాతం సృష్టించి ఈడి అధికారుల ద్వార వ్యాపారాలతోసంబంధాలు కలిగిన వారిఇళ్లపై దాడులు చేయించారు. ప్రస్తుతానికి ప్రతిపక్షం ఐక్యత సాధించలేకపోయినప్పటికీ భవిష్యత్‌లో రానున్న ప్రమాదాన్ని గుర్తించి ఏకం కావల్సిన తరుణం ఇదే. 2012 లో అన్నాహజారే నాయకత్వంలో జరిగిన అవినీతివ్యతిరేక ఉద్యమంఫలితంగా దిల్లీలో ఆనాటి కాంగ్రెస్‌ప్రభుత్వం అధికారాన్ని కోల్పోయింది. అప్పటి నుంచీ ఆప్‌ప్రతి ఎన్నికలోను గెలిచి అధికారాన్ని పదిలపరుచుకుంది. ఆప్ కూడ తమకు కలిగిన అనుభవాన్నే ఎదుర్కొంటుందని కాంగ్రెస్ ఆనాడు ఖండించింది.

మోదీప్రభుత్వం రాజకీయకక్షతో ఎంపికచేసుకున్న ప్రతిపక్ష నాయకులను అరెస్టుచేసి హింసించేందుకు ఈడి, సీబిఐ, ఐటి శాఖలను తన పనిముట్లుగా చేసుకుంటుందని కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేశ్ ట్వీట్‌చేశారు. ఈ దర్యాప్తుసంస్థలు వృత్తినైపుణ్యాన్ని పూర్తిగా కోల్పో యాయని ఆయన వ్యాఖ్యానించారు. ఆప్, కాంగ్రెస్‌ల మధ్య విభేదాలు సృష్టించడంలో మోదీ-షాల వ్యూహం విజయం సాధించింది. 2024 ఎన్నికల్లోపు ఆప్ , బిఆర్ఎస్ మధ్య అగాధాన్ని సృష్టించే పనిలో ఈ ద్వయం ఉన్నారు. ఈ రెండు పార్టీలు కాంగ్రెస్‌తో కలవకూడదన్న వీరి ఎత్తుగడ కూడ ఫలించిందనే చెప్పాలి. ఈ పార్టీల మధ్య ఓట్లు చీలిపోతే అది బీజేపీకి ప్రయోజనం కలిగిస్తుంది. మరోవైపు ఆప్ కాంగ్రెస్ బలంగా ఉన్న అన్ని రాష్ట్రాలను లక్ష్యంగా పెట్టుకొని ఎన్నికల బరిలో దిగి ఓట్లను చీల్చి కాంగ్రెస్‌కు నష్టం కలిగిస్తోంది. పంజాబ్‌లో మోదీ- అమిత్‌షాల వ్యూహం కూడ ఫలించి కాంగ్రెస్ నుండి ఆప్ అధికారాన్ని దక్కించు కున్నది. గుజరాత్‌లోను ఆప్ ప్రవేశించడంతో కాంగ్రెస్ 50 సీట్ల వరకు కోల్పోయింది. ఆప్ వల్ల బీజేపీకే మేలుజరిగింది. తెలంగాణలో బిఆర్ఎస్, బెంగాల్‌లో టిఎంసీ తమతమ రాష్ట్రాల్లో తమ పార్టీలే గెలుస్తాయని ఆశిస్తూ ఇప్పటి వరకు కాంగ్రెస్‌కు దూరంగానే ఉన్నాయి. రానున్న నెలల్లో ప్రతిపక్షాలను, ఆయా పార్టీల నాయకులను మరింత అప్రతిష్ఠ పాలుచేసి వీరి మధ్య చీలికలు తీసుకొచ్చే వ్యూహాన్ని మోదీ-షాలు అనుసరించ నున్నారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, ఆప్, బిఆర్ఎస్, జెడియు, జెడిఎస్, జెఎన్ఎం, ఆర్‌జెడి, టిఎంసీ, వామపక్షాలు ఎదురుకానున్న ప్రమాదాన్ని గ్రహించి తమ మధ్య ఉన్న చిన్న చిన్న తగాదాలను పక్కనపెట్టి బలమైన ఐక్యతను సాధించాలి.

అదానీ సినిమాలో రైల్వే పోర్టర్ సంచలనం !!

ఎం. కోటేశ్వరరావు

లాహిరి లాహిరి లాహిరిలో ఓహెూ జగమే ఊగెనుగా ఊగెనుగా అంటూ సాగిపోతున్న నరేంద్రమోదీ నౌకకు నెల రోజుల్లో మూడు కుదుపులు. అదానీకి నాలుగు. అదానీ మాయలోకం సినిమా విడుదలై త్వరలో మాసోత్సవం జరుపుకోనుంది. కంపెనీల వాటాల ధరలనే కాదు, వికీపీడియా సమాచారాన్ని కూడా సొంత మనుషులతో అనుకూలంగా మలుచుకున్నట్లు తాజాగా తేలింది. వికీపీడియా నడిపే సైన్ పోస్ట్ అనే పత్రిక అదానీ కిరాయి రాతగాళ్ల బండారాన్ని ఫిబ్రవరి 20వ తేదీన వెల్లడించింది. అనూహ్యమైన ఈ పరిణామాలు ప్రధాని నరేంద్రమోదీ, బిజెపిని ఇరకాటంలోకి నెట్టాయి. అర్థంగాని అంశం ఏమంటే మొదటి మూడింటిని తప్పుడు ప్రచారం, ఆధారం లేని, పథకం ప్రకారం దేశం మీద, ప్రజాస్వామ్యం మీద దాడిగా, నరేంద్రమోదీ సర్కార్‌ను దెబ్బతీసేవిగా చిత్రిస్తూ పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. వికీపీడియా వెల్లడించిన అక్రమంతో తమకు సంబంధం లేదని తప్పించుకుంటారా ఏం చేస్తారో చూడాలి. వికీపీడియాలో అదానీ కంపెనీలు, కుటుంబానికి చెందిన వివరాలను దొంగ పేర్లతో అదానీ కంపెనీ సిబ్బంది, కిరాయి సంపాదకులు అదానీకి అనుకూలంగా పోస్టులను దిద్దినట్లు తేలింది. సోషల్ మీడియాలో ఇలాంటి ఖాతాలను కోకొల్లలుగా తెరిచి ఉదాహరణకు కొందరు నరేంద్రమోదీ గొప్పతనాన్ని పొగిడితే మరికొందరు ఇతర పార్టీల నేతల మీద తప్పుడు ప్రచారాలకు దిగుతున్న సంగతి తెలిసిందే.

గుజరాత్ మారణకాండ మీద బిబిసి నిర్మించిన రెండు భాగాల డాక్యుమెంటరీ వివాదం ఇంకా సద్దుమణగలేదు. అదానీ కంపెనీ అక్రమాలంటూ హిండెన్‌బర్గ్ వెల్లడించిన నివేదిక, దానిమీద తలెత్తిన ప్రశ్నలకు విదేశీ మదుపుదార్లకు, సొంత పార్లమెంటుకు నరేంద్రమోదీ సమాధానం చెప్పాలంటూ ప్రపంచ మదుపుదారు జార్జి సోరస్ ఒక అంతర్జాతీయ వేదిక మీద చేసిన వ్యాఖ్య సంచలనం కలిగించింది. ఆ సభలో ప్రపంచదేశాల ప్రతినిధులందరూ ఉన్నారు. చిత్రం ఏమంటే బిబిసి డాక్యుమెంటరీ గురించి స్పందించాల్సిందేమీ లేదని విదేశాంగశాఖ ప్రతినిధి చెప్పారు. సామాజిక మాధ్యమంలో వాటిని చూడకుండా లింకుల మీద మాత్రం నిషేధం విధించి తొలగించారు. హిండెన్‌బర్గ్ మీద అసలు నోరెత్తటానికే సిద్ధపడలేదు. జార్జి సోరస్ ప్రకటన మీద మాత్రం అసలు ఎవడీ సోరస్, ఈ ముసలోడికి అంత ధైర్యం ఎక్కడి నుంచి వచ్చింది, సమాధానం చెప్పాలని నరేంద్రమోదీనే అడుగుతాడా అన్నట్లుగా బిజెపి మంత్రులు, నేతలు స్పందిస్తున్నారు. జనవరి 25 నుంచి అదానీ కంపెనీల వాటాల విలువ పడిపోతూనే ఉంది. అధిక ధరల్లో వాటాలు కొనుగోలు చేసిన వారు ఎంత సొమ్ము పోగొట్టుకున్నారు అన్నది ఇంకా స్పష్టంగా చెప్పలేము. వారంనాడు ఆ మొత్తం రు. 12 లక్షల కోట్లని వార్త. మొత్తంగా చూసిన కంపెనీల వాటాల విలువ సగానికి సగం పతనమైంది. దీంతో కంపెనీల మార్కెట్ విలువ 120 బిలియన్ డాలర్ల వరకు పతనమైనట్లు ఇండియా టుడే వారం క్రితం తెలిపింది. ఒక్కో సంస్థ ఒక్కో పద్దతిలో ఈ అంకెలను చెబుతున్నాయి. గతంలో గరిష్ట విలువ 147 బి.డాలర్లు కాగా ఇప్పుడు 47.9 బి.డాలర్లకు తగ్గినట్లు ఫోర్బ్సు చెప్పగా 49.1 బి.డాలర్లని బ్లూమ్ బెర్గ్ పేర్కొన్నది. జనవరి 20న అదానీ టోటల్ గ్యాస్ కంపెనీ వాటా ధర రు.3,618 ఉండగా నెల తరువాత రు.922కు తగ్గింది.

ఐరోపాలోని మ్యూనిచ్ నగరంలో జరిగిన సమావేశంలో రైల్వే పోర్టర్‌గా పనిచేసిన జార్జి సోరస్ మాట్లాడుతూ అదానీపై తలెత్తిన ప్రశ్నలకు మోదీ సమాధానం చెప్పాలని అన్నాడు. నలభై రెండు నిమిషాల పాటు చేసిన ప్రసంగంలో అదానీ-మోదీ బంధంతో పాటు ఇతర అనేక అంశాలను ప్రస్తావించాడు."మోదీ, వాణిజ్య దిగ్గజం అదానీ సన్నిహితులు. వారిది విడదీయలేని బంధం. వాటాలను తిమ్మిని బమ్మిని చేసినట్లు అదానీ మీద ఆరోపణలు రావటంతో అవి పేకమేడల్లా కుప్పకూలాయి. మోదీ దీనిమీద మౌనంగా ఉన్నారు. కానీ అతను విదేశీ మదుపుదార్లకు పార్లమెంటు సమాధానం చెప్పాలి. ఈ పరిణామంతో భారత కేంద్ర ప్రభుత్వం మీద నరేంద్రమోదీకి ఉన్న గట్టి పట్టు గణనీయంగా బలహీనపడుతుంది. సంస్థాపరమైన సంస్కరణలకు ద్వారాలను తెరుస్తుంది. నేను అమాయకుడిని కావచ్చు, కానీ భారత్‌లో ప్రజాస్వామ్య పునరుద్దరణ జరుగుతుందని భావిస్తున్నా" సోరస్ అన్నాడు.

ప్రపంచ ఆధిపత్యం కోసం రెండు రకాల పాలనా వ్యవస్థలు పోటీ పడుతున్నాయి. గుట్టుగా ఉండే దేశాల కంటే బహిరంగ మైనవి నైతికంగా ఉన్నతంగా ఉంటాయని వాటి మధ్య తేడాలను వివరిస్తూ భారత్ ఒక ఆసక్తి కలిగించే అంశమన్నాడు. అది ప్రజాస్వామికమే గాని దాని నేత నరేంద్రమోదీ ప్రజాస్వామికవాది కాదన్నాడు. భారత్ క్వాడ్(చతుష్టయ) సభ్యురాలు, అదే సమయంలో రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకొని సొమ్ము చేసుకుంటున్నది అన్నాడు. ఈ మాటలు బిజెపి నేతలకు ఆగ్రహం తెప్పించాయి. కేంద్ర మంత్రి స్మృతిఇరానీ అగ్గిమీద గుగ్గిలం మాదిరి మండిపడ్డారు. ఇది నరేంద్రమోదీ మీదనే కాదు భారత ప్రజాస్వామిక వ్యవస్థ మీద కూడా దాడి అంటూ దీన్ని అందరూ ఒకే కంఠంతో ఖండించాలని అన్నారు. అదానీ లేదా అతని కంపెనీల గురించి దేశంలో గగ్గోలు తలెత్తితే పార్లమెంటులో చేసిన ప్రసంగంలో నరేంద్రమోదీ ఒక్కసారి కూడా ఆ ప్రస్తావన లేకుండా మాట్లాడిన సంగతి తెలిసిందే. అలాంటి నేత గురించి అందరూ కలసి ఖండించాలని చెప్పటానికి ఎవరికైనా నోరెలా వస్తుంది. అదానీ కంపెనీల వాస్తవాల నిర్ధారణకు పార్లమెంటరీ కమిటీని మాత్రమే వేయాలని ప్రతిపక్షాలు కోరాయి. దానికి కూడా నోరు రాలేదు.

భారత్‌తో సహా ప్రపంచంలోని ప్రజాస్వామిక వ్యవస్థలలో జోక్యం చేసుకొనేందుకు జార్జి సోరస్ ఒక బిలియన్ డాలర్లు పక్కన పెట్టాడని (మన కరెన్సీలో రు.8,200 కోట్లు), మన దేశంలో తాను ఎంపిక చేసిన వారు ప్రభుత్వనేతలుగా ఉండాలని కోరుకున్నట్లు స్మృతిఇరానీ ఆరోపించారు. ఆమె చెప్పినట్లు ఆ మొత్తాన్ని ఒకవేళ ఇక్కడే ఖర్చు చేసినప్పటికీ కుప్పకూలేంత బలహీనంగా మోదీ సర్కార్ ఉన్నదా ? అంత మొత్తానికి బిజెపి ఎంపీలందరూ అమ్ముడుపోతారా? కేంద్ర సమాచార, ప్రసారశాఖ సలహాదారు కాంచన్ గుప్తా దీని గురించి స్పందిస్తూ పాలకుల మార్పు కావాలని కోరుతున్న శక్తులవెనుక ఉన్నదెవరో తేలిపోయిం దన్నారు. వారికి జార్జి సోరస్ నడిపే ఓపెన్ సొసైటీ ఫౌండేషన్ నుంచి నిధులు అందచేస్తున్నట్లు ఆరోపించారు. భారత్‌కు అనేక మంది శత్రువు లుండగా వారందరినీ సోరస్ నడిపిస్తున్నాడని ఆరోపించారు. భారత్‌లో ప్రజాస్వామ్యం బలంగా ఉందని 2024 ఇంకా ఎంతో దూరం లేదని మరోసారి ఆశాభంగం చెందక తప్పదని అన్నారు. మోదీ గురించి సోరస్ చేసిన వ్యాఖ్యలపై మన విదేశాంగశాఖ మంత్రి ఎస్ జైశంకర్ స్పందిస్తూ ఒక ముసలోడు, ధనికుడు, మొండిమనిషి న్యూయార్క్‌లో కూర్చొని ప్రపంచమంతా ఇంకా తాను చెప్పినట్లు నడుస్తున్నదని అనుకుంటున్న మనిషి అన్నారు. తాను అభిమానించిన వారు గెలిస్తే సోరస్ వంటి వారికి అది మంచిది లేకపోతే ప్రజాస్వామ్యం లోపభూయిష్ట మంటాడు అన్నారు. రైతుల ఆందోళన, సిఎఎ,ఎన్ఆర్‌సిలపై సాగిన ఆందోళనల వెనుక సోరస్ హస్తం ఉన్నట్లు బిజెపి ప్రచారం చేసిన సంగతి తెలిసిందే.

ట్విటర్ సేవలకు అంతరాయం

న్యూఢిల్లీ: ప్రముఖ మైక్రో బ్లాగింగ్ సోషల్ మీడియా వెబ్‌సైట్ ట్విటర్ సేవలు కొద్దిసేపు ప్రపంచవ్యాప్తంగా నిలిచిపోయాయి. ట్విట్టర్‌లో మరోసారి ఎర్రర్ మెసేజ్ కనిపించింది. వేలాది మంది యూజర్లకు పేజీలు లోడ్ కాలేదు. ఇటీవలి కాలంలో ట్విటర్ అనేకసార్లు మొరాయించింది. సాంకేతిక కారణాలతో ఆగిపోయింది. ట్విటర్ డౌన్ అయిందంటూ ఇతర సోషల్ మీడియా మాధ్యమాల్లో యూజర్లు పోస్టులు పెట్టారు.అమెరికా, బ్రిటన్, జపాన్, భారత్ సహా అనేక దేశాల్లో ట్విటర్ యూజర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు మస్క్ రెండు వందల మంది ఉద్యోగులను తొలగించారని, అందుకే అకస్మాత్తుగా ఇలా జరిగిందని జాతీయ వార్తా సంస్థలు కథనాలు ప్రచురించాయి. మైక్రోబ్లాగింగ్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్విటర్‌ను హస్తగతం చేసుకున్నాక ఉద్యోగుల తొలగింపుపై దృష్టిపెట్టిన టెస్లా అధినేత ఎలాన్ మస్క్ తాజాగా మరో కీలక చర్యకు నడుం బిగించారు. వ్యయాల తగ్గింపే లక్ష్యంగా కార్యాలయాల మూసివేతకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా భారత్‌లోని మూడు ట్విటర్ కార్యాలయాల్లో రెండింటిని మూసివేస్తూ ట్విటర్ నిర్ణయం తీసుకున్నట్టు రిపోర్టులు పేర్కొంటున్నాయి. ఢిల్లీ, ముంబైల్లోని కార్యాలయాలు మూసివేయాలని నిర్ణయించారు. బెంగళూరు కార్యాలయాన్ని మాత్రం యథావిధిగా కొనసాగించనున్నట్లు తెలుస్తోంది. ఎక్కువ మంది ఇంజినీర్లు ఇక్కడ నుంచి పనిచేస్తున్నారు. ట్విటర్‌ను లాభాల బాటలోకి నడిపించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్న ఎలాన్ మస్క్...గతేడాది నుంచి పెద్ద ఎత్తున ఉద్యోగుల ఏరివేత ప్రకటించారు. అందులో భాగంగా భారత్‌లో పనిచేసే ఉద్యోగుల్లో 90 శాతం మందిని తొలగించినట్టు అనేక నివేదికలు ఇదివరకే పేర్కొన్నాయి. కాగా ట్విటర్ కార్యాలయాల మూసివేత ఒక్క భారత్‌లోనే కాదని తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా చాలా చోట్ల ఆఫీస్‌లను ట్విటర్ మూసివేస్తున్నట్టు సమాచారం. ఇప్పుడు భారత్‌లోనూ ఆఫీస్‌లను మూసివేసింది.

ఐజీఎస్టీపై యూడీఎఫ్ వాదన నిరాధారం

కేరళ ఆర్థికమంత్రి బాలగోపాల్

తిరువనంతపురం: ఐజీఎస్టీ కింద రాష్ట్రానికి రావాల్సిన రూ.25,000 కోట్లు రాలేదన్న ప్రతిపక్ష యూడీఎఫ్ వాదనను కేరళ ఆర్థిక మంత్రి కెఎన్ బాలగోపాల్ తోసిపుచ్చారు. ఇది కేవలం వారు సృష్టించిన 'పొగతెర' అని అభిప్రాయపడ్డారు. అసెంబ్లీ ఆవరణలో బుధవారం బాలగోపాల్ విలేకరులతో మాట్లాడుతూ... ఐజీఎస్టీ అమలు, వసూళ్లకు సంబంధించి సమస్యలున్నాయని, వీటిపై కసరత్తు జరుగుతోందన్నారు. ప్రతిపక్షాలు చిత్రీకరించినంత సీరియస్‌గా పరిస్థితి లేదని స్పష్టం చేశారు. రాష్ట్రానికి ఇంత భారీ నష్టం వాటిల్లిందని శాసనసభలో ప్రతిపక్షాలు చేస్తున్న వాదన నిరాధారమని, రాజకీయంగా లేదా రాజ్యాంగపరంగా అలాంటి ప్రకటనలు సరికాదని అన్నారు. కేవలం సీఎం విజయన్, ఇతర మంత్రులను కించపరిచేందుకే ఇలాంటి అంశాలను ప్రతిపక్షాలు లేవనెత్తడం... విపక్షాలు సభలో చర్చించడానికి సమస్యలు లేకపోవడాన్ని సూచిస్తోందని మంత్రి అన్నారు. ఐజీఎస్‌టీ పూల్ నుంచి కేరళ వాటా పొందకపోవడం, సరిహద్దుల్లో ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ కెమెరాలు (ఏఎన్‌పీఆర్) పనిచేయకపోవడం వంటివి గతంలో యూడీఎఫ్ అసెంబ్లీలో లేవనెత్తిన సమస్యలేనని బాలగోపాల్ తెలిపారు. వయనాడ్ జిల్లాలోని ముతంగలో ఒక్క ఎఎన్‌పిఆర్ కెమెరా తప్ప మిగిలినవన్నీ పని చేస్తున్నాయని మంత్రి తెలిపారు. దేశంలోనే తొలిసారిగా ఎఎన్‌పిఆర్ కెమెరాలను ఏర్పాటు చేసిన రాష్ట్రం కేరళ అని ఆయన చెప్పారు. రాష్ట్రంలో పన్నుల నిర్వహణ మెరుగుపడిందని, దానిని మరింత మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని బాలగోపాల్ వివరించారు.

భారత్‌లో మానవ అక్రమ రవాణా తీవ్రం

- కనీస ప్రమాణాలను పాటించడం లేదు
- అమెరికా విదేశాంగ శాఖ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: భారత్‌లో మానవ అక్రమ రవాణా తీవ్రంగా ఉందని అమెరికా విదేశాంగ శాఖ 'వ్యక్తుల అక్రమ రవాణా-2022' నివేదిక వెల్లడించింది. అయితే దీనిని నిర్మూలించేందుకు భారత్ కనీస ప్రమాణాలను పాటించడం లేదని తెలిపింది. భారత్‌లోని 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో ఇరవై రెండింటిలో మావన అక్రమ రవాణా రేటు 89 శాతంగా ఉన్నప్పటికీ, బాధితులను గుర్తించడం లేదా సంబంధిత నిబంధనల ప్రకారం ఎలాంటి కేసులనూ నమోదు చేయడం లేదని నివేదించింది. అక్రమ రవాణా నేరాలకు పాల్పడిన ప్రభుత్వ అధికారులను విచారించడం, ప్రాసిక్యూట్ చేయడం లేదా దోషులుగా నిర్ధారించడం వంటివి ప్రభుత్వం నివేదించలేదని పేర్కొంది. వ్యక్తుల అక్రమ రవాణాను నిరోధించడానికి ప్రభుత్వం తన జాతీయ కార్యాచరణ ప్రణాళిక (ఎన్‌ఏపీ) లో ఎలాంటి సవరణలు చేయకపోవడం లేదా భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 370 ను సవరించకపోవడంపై నివేదిక నిరాశను వ్యక్తం చేసింది. వెట్టిచాకిరీని పరిష్కరించడానికి అనేక రాష్ట్రాల్లో తగినంత రాజకీయ సంకల్పం లేకపోవడం దేశవ్యాప్తంగా జరుగుతున్న ప్రయత్నాలకు ఆటంకం కలిగిస్తోందని పేర్కొంది. 2020 లో 6,622 మంది అక్రమ రవాణా బాధితులను గుర్తించినట్లు నివేదిక తెలిపింది. అదనంగా 694 సంభావ్య అక్రమ రవాణా బాధితులు ఉన్నారు. 2019లో 5,145 మంది అక్రమ రవాణా బాధితులు, 2,505 మంది సంభావ్య బాధితులు ఉన్నట్టు గుర్తించింది. 2020లో ప్రభుత్వం లేబర్ ట్రాఫికింగ్‌లో 5,156 మంది బాధితులను గుర్తించగా... ఇందులో 2,837 మంది వెట్టిచాకిరి, 1,466 మంది సెక్స్ ట్రాఫికింగ్ లో ఉన్నారు. 80 లక్షల మంది భారతీయులు వెట్టిచాకిరీలో ఉన్నారని అంచనా వేసినప్పటికీ, 1976 నుంచి కేవలం 3,13,962 మందిని మాత్రమే గుర్తించి రక్షించినట్లు కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ వార్షిక నివేదిక తెలిపిందని అమెరికా విదేశాంగ శాఖ తన నివేదికలో పేర్కొంది. 2020లో గుర్తించిన వెట్టిచాకిరీ బాధితుల్లో కర్ణాటక లో 1,291 మంది, తమిళనాడులో 289 మంది, ఉత్తరప్రదేశ్ లో 1,026 మంది ఉన్నారు.

సరికొత్త లుక్‌లో రాహుల్



న్యూఢిల్లీ: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కొత్త లుక్‌లోకి మారారు. భారత్ జోడో యాత్ర పూర్తయ్యే నాటికి ఆయన రూపురేఖలు పూర్తిగా మారాయి. గెడ్డం, మీసాలు పెరిగాయి. తల జుట్టు పెరిగింది. వెంట్రుకలు తెల్లబడ్డాయి. యాత్ర పూర్తయిన వెంటనే కాంగ్రెస్ ప్లీనరీ, అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాహుల్ ఇప్పుడు లండన్‌లో అడుగుపెట్టారు. వారం రోజుల లండన్ పర్యటనలో ఆయన చదువుకున్న కేంబ్రిడ్జి యూనివర్సిటీలో ప్రసంగించనున్నారు. ఇందులో పాల్గొనేందుకు ఆయన గెడ్డం స్లిమ్ చేసుకున్నారు... జుట్టు చిన్నగా కత్తిరించుకున్నారు. హుందాతనం ఉట్టిపడే సూట్ ధరించారు. ఏభై రెండేళ్ల రాహుల్ గాంధీ 'లెర్నింగ్ టు లిజిన్ ఇన్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ' అనే అంశంపై ప్రసంగించనున్నారు. మార్చి 5న ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ సభ్యులతో రాహుల్ సమావేశమవుతారు. రాహుల్‌కు కేంబ్రిడ్జ్ జేబీఎస్ ఆహ్వానం పలుకుతూ ట్వీట్ కూడా చేసింది. 'మా కేంబ్రిడ్జి ఎంబీఏ ప్రోగ్రాం ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ఎంపీ, ప్రముఖ విపక్ష నేత రాహుల్ గాంధీని సాదరంగా ఆహ్వానిస్తోంది. విజిటింగ్ ఫెలో ఆఫ్ కేంబ్రిడ్జి జేబీఎస్‌గా ఆయన లెర్నింగ్ టు లిజన్ ఇన్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ' అనే అంశంపై మాట్లాడతారు' అని ఆ ట్వీట్‌లో పేర్కొంది. రాహుల్ గాంధీ దేశ ఐక్యత నినాదంతో భారత్ జోడో యాత్రను గతేడాది సెప్టెంబర్ 7న కన్యాకుమారిలో ప్రారంభించి 12 రాష్ట్రాల మీదుగా 4000 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. జనవరి 30న యాత్ర ముగిసింది.

ఆయనేమీ సీరియల్ కిల్లర్ కాదు

డేరాబాబాకు హరియాణా సర్కార్ వత్తాసు



చండీగఢ్: డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ అలియాస్ డేరాబాబాకు పెరోల్ ఇవ్వడాన్ని హరియాణా ప్రభుత్వం బుధవారం సమర్థించింది. ఆయనేమీ సీరియల్ కిల్లర్ కాదని, రెండు హత్యల కేసులో ఆయనకు పడిన శిక్షను సీరియల్ కిల్లింగ్‌గా పేర్కొనరాదని వాదించింది. ఈ మేరకు హరియాణా ప్రభుత్వం అఫిడవిట్‌ను పంజాబ్-హరియాణా హైకోర్టుకు సమర్పించింది. ఈ ఏడాది జనవరి మొదట్లో డేరాబాబాకు పెరోల్ మంజూరు చేయడాన్ని హరియాణా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ సమర్థించారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోదన్నారు. అత్యాచారం, హత్య కేసులో దోషిగా హరియాణా రోహ్‌తక్ జైలులో శిక్ష అనుభవిస్తున్న డేరాబాబాకు జనవరి 21న 40 రోజుల పెరోల్ ఇవ్వడంపై సీఎం స్పందిస్తూ ఆయనకు పెరోల్ ఇచ్చిన విషయం తనకు తెలియదన్నారు. అన్ని నిబంధనలు తప్పనిసరిగా పాటించిన తర్వాతే పెరోల్ ఇస్తారన్నారు. పెరోల్ ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం ఏమాత్రం ఉండదన్నారు. 2021లో అత్యాచార నేరానికి డేరాబాబా, మరో నలుగురికి సీబీఐ ప్రత్యేక కోర్టు యావజ్జీవ జైలుశిక్ష విధించింది. ఇద్దరు మహిళా భక్తులపై అత్యాచారం కేసులో 2017లో డేరాబాబాకు 20 ఏళ్ల జైలుశిక్ష విధించడంతో హింసాత్మక ఘటనలు చోటుచేసుకుని 36 మంది ప్రాణాలు కోల్పోవడం తెలిసిందే.

డీఎంకేతో పొత్తుపై ఇప్పుడే చెప్పలేను: కమల్

చెన్నై: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకేతో పొత్తు ఉంటుందా లేదా అనే విషయాన్ని ఇప్పుడే చెప్పలేనని మక్కల్ నీది మయ్యం అధ్యక్షుడు, సినీనటుడు కమల్‌హాసన్ చెప్పారు. డీఎంకే అధ్యక్షుడు, సీఎం ఎంకే స్టాలిన్ 70వ పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని స్థానిక ప్యారీస్‌లోని రాజా అన్నామలై మండ్రంలో స్టాలిన్ 70 పేరుతో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను కమల్‌హాసన్ ప్రారంభించారు. అనంతరం కమల్ విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్టాలిన్ మహానేత కలైంజర్ తనయుడిగా ఉన్నప్పటి నుంచి తనకు బాగా తెలుసన్నారు. తమ ఇద్దరి మధ్య మంచి స్నేహ సంబంధాలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా ఒక ముఖ్యమంత్రి కుమారుడు అనే సంతోషం ఎంతో ఉన్నప్పటికీ.. అంతకు మించిన కష్టాలు, సవాళ్లు ఆయనకు ఉన్నాయన్నారు. సంతోషాన్ని అనుభవిస్తూ, కష్టాలను ఎదురీదుతూ అంచెలంచెలుగా కార్యకర్తగా, యువజన విభాగం అధ్యక్షుడిగా, శాసనసభసభ్యుడిగా, మేయర్‌గా, మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా, ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నారని వివరించారు. స్టాలిన్‌కు కేవలం సహనం, ఓర్పు మాత్రమే కాకుండా, ప్రతిభ కూడా పుష్కలంగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో డీఎంకేతో పొత్తుపై ఇప్పుడే చెప్పలేనని ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు. స్టాలిన్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్నట్టు కమల్ హాసన్ చెప్పారు.

జర్నలిజంలో ఉత్తమ ప్రమాణాలు అవసరం

- పీసీఐ చైర్‌పర్సన్ జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్ వ్యాఖ్య
- ఏబీకే ప్రసాద్‌కు 'రాజా రామ్ మోహన్‌రాయ్' పురస్కారం

న్యూఢిల్లీ: భయం, పక్షపాతం లేకుండా మీడియా స్వేచ్ఛగా పనిచేసేలా ప్రోత్సహించే ఏకైక చట్టబద్ధ వ్యవస్థ ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(పీసీఐ) అని ఆ సంస్థ చైర్‌పర్సన్ జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్ చెప్పారు. జర్నలిజంలో ప్రమాణాలు మెరుగుపరచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఆమె మంగళవారం ఇక్కడ జరిగిన 'నేషనల్ అవార్డ్స్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ జర్నలిజం 2020' ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రసంగించారు. గ్రామీణ, అభివృద్ధి, ఫొటో జర్నలిజంలో అద్భుతంగా పనిచేసే ప్రింట్ మీడియా పాత్రికేయులను ప్రోత్సహించడానికి కౌన్సిల్ ఈ అవార్డులు ఏర్పాటు చేసినట్లు ఆమె చెప్పారు. పాత్రికేయ రంగానికి అనుపమాన సేవలు అందించే జర్నలిస్టులకు రాజా రామ్ మోహన్‌రాయ్ నేషనల్ అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ జర్నలిజం పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నామన్నారు. ఈసారి దాన్ని ప్రముఖ తెలుగు పాత్రికేయులు ఏబీకే ప్రసాద్‌కు అందజేశారు. గ్రామీణ పాత్రికేయం(రూరల్ జర్నలిజం) అవార్డు దైనిక్ జాగరణ్ పాత్రికేయుడు రోహితాశ్వ కుమార్ వర్మ, ఉత్తమ కార్టూనిస్టు అవార్డు సాక్షి పత్రిక కార్టూనిస్టు శంకర్ పామర్తికి, ఉత్తమ ఫొటో జర్నలిజం పురస్కారాలు దైనిక్ జాగరణ్ ఫొటోగ్రాఫర్ ఇర్షూర్ ఆలం, ది వీక్ ఫొటోగ్రాఫర్ భాను ప్రకాశ్‌చంద్రలకు, క్రీడా వార్తల రిపోర్టింగ్ అవార్డు ది వీక్ సీనియర్ కరస్పాండెంట్ మిని పి.థామస్‌కి, అభివృద్ధి కథనాల రిపోర్టింగ్ అవార్డు మాతృభూమి సీనియర్ కంటెంట్ రైటర్ రమ్యకు, ఆర్థిక వ్యవహారాల రిపోర్టింగ్ పురస్కారం విజయవాణి అసిస్టెంట్ ఎడిటర్ రుద్రణ్ణ హర్తికొటేకి, జెండర్ ఇష్యూ రిపోర్టింగ్ అవార్డు మాతృభూమి సబ్ ఎడిటర్ నిలీన అతోలికి అందజేశారు.

70వ పడిలో స్టాలిన్... శుభాకాంక్షల వెల్లువ

చెన్నై: డీఎంకే అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ 70వ పుట్టినరోజు వేడుకలను బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా డీఎంకే కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహా అనేకమంది ప్రముఖులు, నాయకులు స్టాలిన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. మెరీనా బీచ్ ఒడ్డున ఉన్న మాజీ ముఖ్యమంత్రులు ఎం కరుణానిధి, సీఎన్ అన్నాదురైల సమాధి వద్ద పార్టీ నేతల సమక్షంలో స్టాలిన్ కేక్ కట్ చేశారు. అనంతరం పెరియార్ ఈవీ రామస్వామి స్మారక స్థూపాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తన జన్మదినాన్ని పురస్కరించుకొని ఒక మొక్కను నాటారు. తనను పార్టీ కార్యకర్తలకు, ఇతరులకు మొక్కలను బహూకరించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ స్టాలిన్‌తో ఫోన్‌లో మాట్లాడి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మోదీ, రాహుల్ గాంధీ శుభాకాంక్షలు తెలుపుతూ ట్వీట్ చేశారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి, ఎండీఎంకే అధినేత వైకో, రాష్ట్ర కార్యదర్శి ఆర్ ముత్తరసన్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కే బాలకృష్ణన్, ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ నేత కేఎం ఖాదర్ మొహిద్దీన్, విడుతలై చిరుతైగల్ కట్చి అధ్యక్షుడు తోల్ తిరుమావళవన్, తమిళనాడు, తెలంగాణ గవర్నర్‌లు ఆర్ఎన్ రవి, తమిళిసై సౌందరరాజన్, తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు కేసీఆర్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేరళ, ఢిల్లీ ముఖ్యమంత్రులు పినరయి విజయన్, అరవింద్ కేజ్రీవాల్ తదితరులు స్టాలిన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. మక్కల్ నీది మయ్యం అధినేత, నటుడు కమల్ హాసన్, సూపర్‌స్టార్ రజనీకాంత్ ఫోన్‌లో మాట్లాడి స్టాలిన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

అమెరికా ప్రతిష్ఠాత్మక అవార్డుకు హిందీ రచయిత ఎంపిక

న్యూఢిల్లీ: ప్రముఖ హిందీ నవలా రచయిత, కవి వినోద్ కుమార్ శుక్లా (87) ఈ ఏడాదికిగాను అమెరికా ప్రతిష్ఠాత్మక అవార్డు పెన్/నబొకొవ్‌కు ఎంపికయ్యారు. అంతర్జాతీయ సాహిత్య విభాగంలో ఆయనను ఈ అవార్డు వరించింది. 'నౌకర్ కీ కమీజ్' (1979) వంటి నవలలు, 'సబ్ కుచ్ హోనా బచా రహేగా' (1992) కవితా సంకలనాలతో గుర్తింపు పొందారు. దశాబ్దాల తరబడి రాస్తున్నప్పటికీ ఆయనకు గుర్తింపు రాలేదని, అయితే సామాన్యులు సైతం అర్థం చేసుకునేలా ఆధునికతను మేళవించి చేసిన రచనలతో ప్రత్యేక గుర్తింపు సాధించారని న్యాయమూర్తులు అమిత్ చౌదరి, రొయా హకాకియన్, మెంగిస్టే పేర్కొన్నారు. ఆయన రచనల్లో కనిపించే స్వరం తెలివైన వీక్షకుడిలా ఉంటుందని అన్నారు. ఈ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం మార్చి 2న న్యూయార్క్‌లో జరగనుంది. శుక్లా గతంలో సాహిత్య అకాడమీ అవార్డుతో పాటు బెంగళూరు ఫెస్టివల్ బుక్ ప్రైజ్ అట్టా గలాట్టాను గెలుచుకున్నారు.

అంబానీ కుటుంబానికి జెడ్ ప్లస్ భద్రత: సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ కుటుంబ సభ్యులకు దేశ, విదేశాల్లో జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత కల్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ భద్రత కోసం అయ్యే ఖర్చులను వారే సొంతంగా భరించాలని తెలిపింది. యూనియన్ ఆఫ్ ఇండియా వర్సెస్ బికాశ్ సాహా కేసులో దాఖలైన మిసిలేనియస్ పిటిషన్‌పై జస్టిస్ కృష్ణ మురారి, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లా సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. ముకేశ్ అంబానీకి గల ముప్పును తెలిపే నివేదికలు సమర్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని త్రిపుర హైకోర్టు ఆదేశించడాన్ని పిటిషనర్ సవాల్ చేశారు. ముకేశ్ అంబానీకి, ఆయన కుటుంబ సభ్యులకు భారత్‌లోనూ, విదేశాల్లోనూ జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత కల్పించాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. దీనికోసం అయ్యే ఖర్చులను అంబానీలే భరించాలని తెలిపింది. వీరికి భద్రత కల్పించడంపై దేశంలోని వివిధ ప్రాంతాల్లో, వివిధ హైకోర్టుల్లో వివాదం నడుస్తున్న విషయాన్ని తాము గుర్తించినట్లు తెలిపింది. అంబానీలు మన దేశంలో ఉన్నపుడు మహారాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర హోంమంత్రిత్వ శాఖ భద్రత కల్పించాలని తెలిపింది. వారు విదేశాలకు వెళ్లినపుడు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ భద్రత కల్పించాలని పేర్కొంది. ముప్పు ఉన్నపుడు, భద్రత కోసం అయ్యే ఖర్చులను వారే భరిస్తున్నపుడు వారు ఎక్కడ ఉండాలనే విషయానికి పరిమితం చేయడం సరికాదని తెలిపింది. ఆ విధంగా పరిమితం చేయడం వల్ల వారికి భద్రత కల్పించడం వెనుకగల ఉద్దేశం దెబ్బతింటుందని పేర్కొంది. సీనియర్ అడ్వకేట్ ముకుల్ రోహత్గి వాదనలు వినిపిస్తూ ముంబై పోలీసులు, కేంద్ర హోం శాఖ, కేంద్ర ప్రభుత్వం అంబానీలకుగల ముప్పు గురించి మదింపు చేశాయని తెలిపారు. వారికి ప్రాణహాని ఉన్నట్లు నిర్ధారించినందువల్లే జెడ్ ప్లస్ కేటగిరీ భద్రతను కల్పించారని పేర్కొన్నారు. అంబానీలకు దేశవ్యాప్తంగా, విదేశాల్లో వ్యాపార సంస్థలు ఉన్నాయని, వారు దాతృత్వ కార్యకలాపాలు కూడా నిర్వహిస్తారని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థను అస్థిరపరచడం కోసం వీరిని లక్ష్యంగా చేసుకుని దాడులు చేసే అవకాశం ఉందన్నారు. ఈ ప్రమాదం కేవలం మన దేశంలో మాత్రమే కాకుండా విదేశాల్లోనూ ఉంటుందన్నారు. కాగా, త్రిపుర హైకోర్టు ఆదేశాల్లో జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది.

అమితాబ్, ధర్మేంద్రకు బాంబు బెదిరింపులు



ముంబై: బాలీవుడ్ దిగ్గజం అమితాబ్ బచ్చన్, ప్రముఖ బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర నివాసాల సమీపంలో బాంబులు పెట్టినట్లు ఓ ఆగంతకుడు నాగపూర్ పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్‌చేసి చెప్పాడు. ఈ బెదిరింపు ఫోన్ కాల్ మంగళవారం వచ్చినట్లు తెలుస్తోంది. నాగపూర్ పోలీసులు వెంటనే అప్రమత్తమై ముంబై పోలీసులకు సమాచారాన్ని అందజేశారు. ముంబైలోని జుహు, విలే-పార్లే, గమ్‌దేవి పోలీస్ స్టేషన్లకు చెందిన పోలీసులు వెంటనే అమితాబ్, ధర్మేంద్ర నివాసాల వద్ద తనిఖీలు చేశారు. అనుమానించదగిన వస్తువులేవీ కనిపించలేదు. ఈ ఆగంతకుడు మరో బెదిరింపు కూడా చేసినట్లు తెలుస్తోంది. ఉగ్రవాద దాడి చేయడం కోసం 25 మంది సాయుధులు ముంబైలోని దాదర్‌కు చేరుకున్నారని చెప్పినట్లు సమాచారం. అమితాబ్‌కు ముంబైలో ఐదు విలాసవంతమైన బంగళాలు ఉన్నాయి. ధర్మేంద్రకు జుహూలో ఓ బంగళా ఉంది.

బీహార్ అసెంబ్లీలో బీజేపీ రగడ

పాట్నా: బీహార్ అసెంబ్లీలో ప్రతిపక్ష బీజేపీ సభ్యులు బుధవారం రగడ సృష్టించారు. గాల్వాన్ అమరవీరుడి కుటుంబసభ్యులతో పోలీసులు అనుచితంగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. 2020 జూన్‌లో గాల్వాన్ లోయలో చైనా సైనికులతో పోరాడి మరణించిన జవాన్ జైకిషోర్ సింగ్ తండ్రి రాజ్ కపూర్ సింగ్ అరెస్టును ఖండిస్తూ అసెంబ్లీ కార్యకలాపాలు ప్రారంభానికి ముందు ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఆసెంబ్లీ ప్రాంగణం ముందు ప్రదర్శన నిర్వహించారు. ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కావడానికి ముందే కొందరు బీజేపీ ఎమ్మెల్యేలు శాసనసభ కార్యదర్శి డెస్క్‌పై కుర్చీ వేసి సభా కార్యక్రమాలకు అంతరాయం కలిగించేందుకు ప్రయత్నించారు.

స్పీకర్ అవధ్ బిహారీ చౌదరి... ప్రతిపక్ష నేత విజయ్ కుమార్ సిన్హా సభలో మాట్లాడేందుకు అనుమతించారు. బీహార్‌లో మహా కూటమి అధికారం చేపట్టినప్పటి నుంచి సాయుధ బలగాలను కించపరచడం ఉద్దేశపూర్వకంగానే జరిగిందని, యాదృచ్ఛికం కాదని సిన్హా ఆరోపించారు. ప్రభుత్వం సమాధానం ఇవ్వడానికి ఎటువంటి ప్రశ్న అడగలేదని స్పీకర్ అభ్యంతరం వ్యక్తం చేయగా, గాల్వాన్ అమరవీరుడి సమస్యపై చర్చించడానికి బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సిన్హా డిమాండ్ చేశారు. 'చైర్‌ను ప్రభుత్వం నిర్దేశించకూడదు' అని ఆయన అన్నారు. ఈ సమయంలో రాష్ట్ర శాసనసభ వ్యవహారాల మంత్రి విజయ్ కుమార్ చౌదరి లేచి 'ప్రతిపక్షాల ఒత్తిడితో చైర్ తప్పుడు నిర్ణయం తీసుకోకూడదు' అని స్పష్టం చేశారు. ఈ వాగ్వాదం కొనసాగుతుండగా, ఉపముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ లేచి జై కిషోర్ సింగ్ కుటుంబాన్ని తాను కలిశానని పేర్కొన్నారు. 'అతను నేను ప్రాతినిధ్యం వహిస్తున్న అసెంబ్లీ స్థానానికి (రాఘోపూర్) దూరంగా ఉన్న (జందాహా పోలీస్ స్టేషన్ పరిధిలోని చక్ఫతా) గ్రామానికి చెందినవాడు' అని యాదవ్ చెప్పారు. అమరవీరుడి స్మారకార్థం వైశాలి జిల్లా జందాహాలో స్మారక చిహ్నం నిర్మించాలన్న మృతుడి తండ్రి డిమాండ్‌ను చట్ట ప్రకారం పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు. జవాను కుటుంబం స్మారక స్థూపాన్ని అక్రమంగా నిర్మిస్తున్నారంటూ వ్యతిరేకించిన తోటి గ్రామస్తుడితో వాగ్వాదం తర్వాత జవాన్ తండ్రిని శనివారం అరెస్టు చేసి ఎస్సీఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేశారని పేర్కొన్నారు.

జవాన్ తండ్రిని పోలీసులు ఈడ్చుకెళ్లారని మీడియాలో వచ్చిన వార్తలను వైశాలి జిల్లా అధికారులు కూడా ఖండించారు. బీజేపీ ఎమ్మెల్యేలు వాకౌట్ చేయడానికి ముందు నినాదాలు చేస్తూనే ఉన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ చౌదరి మాట్లాడుతూ... బీజేపీకి ఆర్ఎస్ఎస్‌లో మూలాలు ఉన్నాయని, స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణత్యాగం చేసిన వ్యక్తులంటే గౌరవం లేని వారికి అమరవీరుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని అన్నారు.

సమగ్ర విచారణ

ఇదిలా ఉండగా, వైశాలి జిల్లా జందాహాలో జరిగిన ఘటనపై మీడియాలో వచ్చిన కథనాలను డీజీపీ ఆర్ఎస్ భట్టి తీవ్రంగా పరిగణిస్తున్నారని, సమగ్ర విచారణ చేపట్టాలని సీఐడీ అదనపు డైరెక్టర్ జనరల్‌ను ఆదేశించారని పోలీసు ప్రధాన కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. దీని ప్రకారం, మొత్తం ఘటనను విచారించడానికి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తారు. దాని నివేదిక ఆధారంగా దోషులుగా తేలిన పోలీసు సిబ్బందిపై చర్యలు తీసుకోవచ్చని ప్రకటన పేర్కొంది.

ఇదేం నిర్వాకం: రాజ్‌నాథ్



న్యూఢిల్లీ: రెండేళ్ల క్రితం గల్వాన్ ఘర్షణ సమయంలో దేశ రక్షణలో నేలకొరిగిన అమర జవాన్ జై కిశోర్ సింగ్ స్మారకం విషయంలో ఆయన తండ్రి రాజ్‌కపూర్ సింగ్‌పై బీహార్ పోలీసులు దురుసుగా ప్రవర్తించిన ఘటనను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్రంగా ఖండించారు. రాజ్‌కపూర్ సింగ్‌ను అరెస్టు చేయడానికి ముందు పోలీసులు ఆయన పట్ల వ్యవహరించిన తీరుపై బుధవారం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్‌కు ఫోన్ చేసి ఈ మొత్తం వ్యవహారం ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. బీహార్‌లోని కథ్రి బుజుర్గ్‌లో రాజ్‌కపూర్ సింగ్ తన కుమారుడికి ఇటీవల ఒక స్మారకం నిర్మించారు. దీనిపై హరినాథ్ అనే పొరుగింటి వ్యక్తి అభ్యంతరం తెలిపారు. ఈ వివాదం పోలీసుల వద్దకు వెళ్లింది. దీంతో గత శనివారం రాత్రి పోలీసులు రాజ్‌కపూర్ సింగ్‌ను అరెస్టు చేసి, ఈడ్చుకెళ్లారు. 15 రోజుల్లో స్మారకాన్ని కూల్చేయాలని బెదిరించారు. ఈ ఘటనను ఆర్మీలోనే పనిచేస్తున్ జై కిషోర్ సింగ్ సోదరుడు నంద్ కిషోర్ ఖండించారు. డీజీపీ తమ ఇంటికి వచ్చి 15 రోజుల్లోగా విగ్రహాన్ని తొలగించాలని చెప్పారని, తగిన పత్రాలు తమ వద్ద ఉన్నాయని తెలియజేశామని అన్నారు. ఆ తర్వాత పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి తమ ఇంటికి వచ్చి తన తండ్రిని అరెస్టు చేశారని, అరెస్టుకు ముందు ఆయనను దూషిస్తూ, చేయి చేసుకున్నారని ఆరోపించారు. పోలీసు చర్యకు నిరసనగా స్థానికులు సైతం ఆందోళనకు దిగారు. అయితే, రాజ్‌కపూర్ సింగ్ కుటుంబ సభ్యుల వాదనను పోలీసులు తోసిపుచ్చారు. హరినాథ్ రామ్ అనే వ్యక్తికి, ప్రభుత్వానికి చెందిన స్థలంలో విగ్రహం ఏర్పాటు చేయడంపై ఎస్సీ-ఎస్టీ చట్టం కింద జనవరి 23న కేసు నమోదైందని, ఆ తర్వాత విగ్రహం చుట్టూ గోడలు లేపారని, ఇందుకోసం తమ నుంచి ఎలాంటి అనుమతి తీసుకోలేదని చెప్పారు. ఒకవేళ విగ్రహం ఏర్పాటు చేసుకోవాలని అనుకుంటే సొంత భూమిలో ఏర్పాటు చేసుకుని ఉండవచ్చని, లేదంటే స్థలం కావాలని ప్రభుత్వాన్ని కోరవచ్చని, భూ ఆక్రమణ ద్వారా భూయజమాని హక్కులను వాళ్లు ఉల్లంఘించారని సబ్ డివిజనల్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు.కాగా, అమర జవాను జైకిషోర్ సింగ్ తండ్రిని అరెస్టు చేసిన తీరుపై తక్షణ విచారణకు బీహార్ డీజీపీ ఆదేశాలు జారీ చేశారు. ఇందుకోసం దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. అమరవీరుని సోదరుడు చేసిన ఆరోపణలపై విచారణ చేయాలని జీడీపీ ఆదేశాలు జారీ చేశారు. ఈ మొత్తం ఘటనలో పోలీసు అధికారి కానీ, సిబ్బంది కానీ దోషిగా తేలితే తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

అదానీ బొగ్గు వ్యాపార విస్తరణకు మోదీ సాయం

న్యూఢిల్లీ: అదానీ బొగ్గు వ్యాపారం విస్తరించేందుకు మోదీ ప్రభుత్వం అసాధారణ సాయం అందించినట్లు విచారణలో బహిర్గతమైంది. ఈ విచారణకు సంబంధించిన పూర్తి వివరాలు జాతీయ మీడియాలో ప్రచురితమైంది. బొగ్గు గనులను అదానీ సంస్థకు నిబంధనలకు విరుద్ధంగా, పారదర్శకత లేకుండా కట్టబెట్టడంతో పాటు మినహాయింపులు కల్పించినట్లు ప్రధాని కార్యాలయం పేర్కొన్నదని నివేదిక తెలిపింది. భారత్‌లోని దట్టమైన అటవీ ప్రాంతాలలో 450 మిలియన్ టన్నుల బొగ్గు బ్లాక్ నుండి బొగ్గును తవ్వుకునేందుకు అదానీ ఎంటర్ ప్రైజెస్ లిమిటెడ్‌కు అనుమతించింది. అయితే చట్టంలో మార్పులు చేసి ఇతర కంపెనీలకు అనుమతులు నిరాకరించింది. అదానీ సంస్థకు మాత్రమే ఎందుకు మినహాయింపు కల్పించిందో ప్రభుత్వం వివరణ ఇవ్వలేదని నివేదిక పేర్కొంది. 204 బొగ్గు బ్లాకుల కేటాయింపులను రద్దు చేస్తూ 2014లో సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన నిబంధనలను అనుసరించి ఈ మినహాయింపులు కల్పించింది.

సీపీఐ జాతీయ సమితి తీర్మానాలు

ఓపీఎస్ పునరుద్ధరించాలి

పుదుచ్చేరికి రాష్ట్రహోదా కల్పించాలి

పుదుచ్చేరి:
పుదుచ్చేరికి రాష్ట్ర హోదా కల్పించాలని సీపీఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు తీర్మానాన్ని ఇటీవల పుదుచ్చేరిలో జరిగిన పార్టీ జాతీయ సమితి సమావేశాల్లో ఆమోదించింది. పుదుచ్చేరికి రాష్ట్ర హోదా డిమాండ్‌ను మొదట చేసినది భారత కమ్యూనిస్టు పార్టీనేనని గుర్తుచేసింది. ఇప్పుడన్ని రాజకీయ పార్టీలు, సామాజిక సంఘాలు ఇదే డిమాండ్ చేస్తున్నాయని తెలిపింది. కేంద్ర పాలిత ప్రాంతాల హక్కులను కేంద్రప్రభుత్వం హరిస్తోందని దుయ్యబట్టింది. అడ్మినిస్ట్రేటర్‌కు సర్వాధికారాలు కట్టబెట్టడంతో శాసనసభ, మంత్రి మండలిది నిస్సహాయ పరిస్థితని పేర్కొంది. 1981 నుంచి 2021 వరకు పుదుచ్చేరికి రాష్ట్ర హోదాను డిమాండ్ చేస్తూ 16 తీర్మానాలను శాసనసభ ఆమోదించి కేంద్రానికి పంపినా ఫలితం లేదని జాతీయ సమితి వెల్లడించింది. సుష్మా స్వరాజ్ నేతృత్వ పార్లమెంటరీ స్థాయి సంఘం 2006 జూన్ 2న పదుచ్చేరికి రాష్ట్ర హోదా కల్పనకు రాజ్యసభకు చేసిన సిఫార్సులు కోల్డ్‌స్టోరేజికి చేరాయని వ్యాఖ్యానించింది. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలతో పుదుచ్చేరి ఆర్థిక సంక్షోభంలో ఉన్నదని, ఖర్చుల కోసం కేంద్రం ఇచ్చే 90శాతం కేటాయింపు 23శాతానికి తగ్గిందని తెలిపింది. 70 ఏళ్లలో పుదుచ్చేరి అనేక రంగాల్లో పురోగతి సాధించిందని, రెవెన్యూ ఆదాయం అనేక దశల్లో చాలాసార్లు మారినాగానీ సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు కేంద్రప్రభుత్వం, లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదం కోసం ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వానికి నిరీక్షణ తప్పడం లేదని పేర్కొంది. శాసనసభ ఉన్న కేంద్ర పాలిత ప్రాంతంగా పుదుచ్చేరికి 15వ ఆర్థిక కమిషన్‌లో స్థానం లభించలేదుగానీ జీఎస్టీ మండలిలో రాష్ట్ర హోదా ఉన్నదని తెలిపింది. ఏదిఏమైనా పుదుచ్చేరి ప్రజల శ్రేయస్సు కోసం కేంద్ర పాలిత ప్రాంతానికి రాష్ట్ర హోదా కోసం తాము చేస్తున్న డిమాండ్‌కు మద్దతివ్వాలని అన్ని పార్టీలు, సామాజిక సంఘాలకు సీపీఐ జాతీయ సమితి పిలుపునిచ్చింది.

- అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలి
- సీపీఐ జాతీయ సమితి డిమాండ్

పుదుచ్చేరి:
దేశంలోనే కాకుండా ప్రపంచ దేశాల్లోనూ పింఛన్ కోసం డిమాండ్ వినిపిస్తోందని సీపీఐ జాతీయ సమితి పేర్కొంది. అర్హులందరికీ పింఛన్ కల్పించాలని డిమాండ్ చేసింది. కొత్త పింఛన్ విధానం (ఎన్‌పీఎస్)ను రద్దు చేసి పాత పింఛన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరించాలని డిమాండ్ చేసింది. ఓపీఎస్ అమలుకు కేంద్రప్రభుత్వం సానుకూలంగా లేని క్రమంలో సంబంధిత నిధులను రాష్ట్ర ప్రభుత్వాలకు తిరిగివ్వాలని, వారే దానిని అమలు చేస్తారని కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానించింది. ఈపీఎస్-95 పరిధిలోని వారు ఈపీఎస్-95 సమీక్షను కోరుతున్నారని తెలిపింది. నెలసరి పింఛన్ కనీసం రూ.7,500 కోసం డిమాండ్ చేస్తున్నారని పేర్కొంది. రైతులు కూడా పింఛన్ కోసం డిమాండ్ చేస్తున్నట్లు వెల్లడించింది. ఎన్‌పీఎస్ లేక పీఎం శ్రమయోగి మంధాన్ యోజన క్రమంలో సంబంధిత లబ్ధి దారుల నుంచి తీసుకునే డబ్బును షేర్‌మార్కెట్లలో పెడుతూ వారి వృద్ధాప్య పింఛన్‌కు భరోసా లేకుండా చేస్తున్నారు. ఇది ప్రమాదకరమైనది. ఈ డిమాండ్లను మంజూరు చేస్తే ప్రభుత్వం దివాలా తీస్తుందని ప్రభుత్వంతో పాటు ప్రధాని వినిపిస్తున్న వాదనలు నిరాధారం. ఇందుకు గణాంకపరమైన వివరణ లేదు. ఓపీఎస్ లేక ఏదేని పింఛన్ (నగదు) లబ్దిదారుల చేతుల్లో ఉంటే అది మార్కెట్‌లో చెలామణి అవుతుందని, తద్వార డిమాండ్ సృష్టి జరుగుతుందని... ఒడిదుడుకులతో సాగుతున్న ఆర్థిక వ్యవస్థకు ఇది ఎంతో అవసరం. అనేక బీజేపీయేతర రాష్ట్రాలు పాత పింఛన్ పథకం పునరుద్ధరణకు హామీనిచ్చాయి. కాబట్టి సంబంధిత అన్ని వర్గాలు సంఘటితమై ఇందుకోసం ఉద్యమించాలని సీపీఐ జాతీయ సమితి పిలుపునిచ్చింది.

ఇథనాల్-పెట్రోల్‌తో
ఇంధన భద్రతకు హామీ లేదు

పుదుచ్చేరి:
ఇథనాల్ కలిపిన పెట్రోల్‌ను కేంద్రప్రభుత్వం ప్రోత్సహిస్తోందిగానీ తద్వార ఇంధన భద్రతకు హామీ లభించబోదని బయో ఇంధనం విధానంపై తన అభిప్రాయాన్ని పుదుచ్చేరిలో జరిగిన జాతీయ సమితి సమావేశాలలో సీపీఐ తెలిపింది. ఇథనాల్- పెట్రోల్‌తో వాతావరణానికి, వాయు కాలుష్యానికీ పరిష్కారం లభించదని, కర్బన ఉద్గారాలు మరింత పెరుగుతాయని పేర్కొంది. ప్రముఖ శాస్త్రవేత్తలు ఇదే విషయాన్ని చెప్పారని గుర్తుచేసింది. ఆటోమొబైల్ పరిశ్రమకు ప్రోత్సాహం కోసం ఇంటర్నల్ కంబ షన్ ఇంజిన్ కార్ల వినియోగంతో ఇంధన దిగుమతి వ్యయం మరింత పెరుగుతుందేగానీ తగ్గదని సీపీఐ జాతీయ సమితి నొక్కిచెప్పింది. ఈ సమస్యకు వాస్తవిక పరిష్కారం ఎలక్ట్రిక్ వాహనాలతోనే సాధ్యమని తెలిపింది. 2030కు ముందే కాలం చెల్లించిన ఆటోమొబైల్స్‌కు చెల్లుచీటినే సరైనదిగా పేర్కొంది. విద్యుత్‌తో నడిచే వాహనాలతో వాటి స్థానాన్ని భర్తీ చేయాలని సూచించింది.రియో తీర్మానాన్ని ప్రస్తావించింది. 2070 నాటికి కర్బన ఉద్గారాలను శూన్యం చేసేందుకు భారత్ కట్టుబడి ఉందిగానీ ఇథనాల్ కలిపిన పెట్రోల్‌ను ప్రోత్సహిస్తే ఆ లక్ష్యాన్ని చేరుకోలేమని పేర్కొంది. ఇథనాల్ కార్యక్రమం వల్ల కోట్ల టన్నుల అదనపు కర్బన ఉద్గారాలు వెలువడతాయని. అందుకే దానిని నిరోధించాలని డిమాండ్ చేస్తున్నామని సీపీఐ జాతీయ సమితి పేర్కొంది.

కాలుష్య కారకులే మూల్యం చెల్లించాలి

పుదుచ్చేరి:
'కాలుష్య కారుకులే మూల్యం చెల్లించాలి' అన్న స్పష్టమైన సందేశంతో కాప్ -27 సదస్సులో ఐక్యరాజ్య సమితి తీర్మానిం చగా ప్రపంచం ఆమోదించిందని సీపీఐ జాతీయ సమితి గుర్తుచేసింది. ఈ క్రమంలో ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు పరిస్థిలు, ఘటనలకు సంబంధించిన విధా నాన్ని సవరించాలని తీర్మానించింది. పర్యా వరణ పరిహారాన్ని కాలుష్య కారకులే చెల్లించాలని, రైతులకు, ఇతర గ్రామీణ జనాభాకు న్యాయమైన పరిహారం ఇచ్చేలా చట్టం తేవాలని, రైతు వ్యతిరేక పీఎంఎఫ్‌బీఐ పంట బీమా పథకాన్ని రద్దు చేయాలని, దాని నిధులను రాష్ట్ర స్థాయి కొత్త పథకాన్ని మళ్లిం చాలని, 2017 నుంచి రైతులకు పంట బీమా క్లెయిమ్‌లు సకాలంలో చెల్లించాలని కోర్టులు ఆదేశాలిస్తున్నా అవి అమలు కావలేదని, పెండింగ్ మొత్తాలు తక్షణమే చెల్లించాలని, రైతులకు పంట బీమా మొత్తాల చెల్లింపునకు న్యాయ కమిషన్ ఏర్పాటు చేయాలని, ఎకో-సెన్సిటివ్ జోన్‌లో అభివృద్ధి పథకాలను కేంద్ర ప్రభుత్వం పున: సమీక్షించాలని తీర్మానంలో సీపీఐ జాతీయ సమితి డిమాండ్ చేసింది. కార్పొరేట్ల లాభాపేక్షకు రైతులు, గ్రామీణులు బలవుతున్నారని నొక్కిచెప్పింది. వరదలు, కరవు కాటకాలు, వడగంట్ల వాన, భూకంపాలు, పంటలపై మిడతల దాడులు వంటి విపత్తులు జరుగుతున్నాయని పేర్కొంది. నయా ఉదారవాద అజెండాతో పంట బీమా పథకాన్ని పీఎంఎఫ్‌బీవై పరిధిలోకి మోదీ ప్రభుత్వం తీసుకు వచ్చింది. అంతకుముందు కరువు మ్యానువల్‌ను సవరించిందని, విపత్తు సహాయక నిధిని రద్దు చేసిందని తెలిపింది. పీఎంఎఫ్‌బీవై... సహాయక చర్యల ఔట్ సోర్సింగ్ అని విమర్శించింది. విపత్తులతో నష్టపోయిన రైతులు ఆత్మహత్యలను శరణ్యంగా భావించారని, మోదీ ప్రభుత్వ కార్పొరేట్ లాభాపేక్ష వల్ల జోషిమఠ్ (ఉత్తరాఖండ్) వంటి ఘటనలు జరుగుతున్నాయని సీపీఐ జాతీయ సమితి పేర్కొంది.

యువతకు ఓటు హక్కు కల్పించాకే
కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు నిర్వహించాలి

పుదుచ్చేరి:
యువతకు ఓటు హక్కు కల్పించిన తర్వాతే కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు నిర్వహించాలని సీపీఐ జాతీయ సమితి తీర్మానించింది. కంటోన్మెంట్ బోర్డులంటే రక్షణ శాఖ పరిధిలో ఉండే స్థానిక సంఘాలు. కంటోన్మెంట్ బోర్డులకు ప్రతినిధుల ఎన్నిక ఐదేళ్లకు ఒకసారి జరుగుతుంది. దేశంలో మొత్తం 62 కంటోన్మెంట్ బోర్డులు ఉన్నాయి. దేశవ్యాప్తంగా వీటికి ఏప్రిల్ 30న ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే రక్షణ భూములో ఉండే కొందరి ఓటు హక్కును సుప్రీంకోర్టు తీర్పు క్రమంలో ఈసారి ఎన్నికల కోసం ఉపసంహరించారు. స్వాతంత్ర్యం రాక ముందు కూడా రక్షణ భూముల్లో ఉండే అనేక వేలమందికి కంటోన్మెంట్ బోర్డుల ఓటర్ల జాబితాలో స్థానం దక్కలేదు. రక్షణ భూము లను కబ్జా చేసే వారిపై చర్యలకు చాలా చట్టాలే ఉన్నాయిగానీ ఓటు హక్కును నిరాకరిం చడం రాజ్యాంగ విరుద్ధం. 1931లో కరాచీ కాంగ్రెస్‌లో స్వాతంత్ర్య ఉద్యమం 'యూనివర్సల్ అడల్ట్ ఫ్రాంచైస్' తీర్మానాన్ని ఆమోదించింది. అసెంబ్లీలు, పార్లమెంటు ఎన్నికల్లో ఓటర్లుగా ఉన్న అనేకమంది అణగారిన వర్గాల వారి ఓటు హక్కును హరించే విధంగా మంత్రిత్వశాఖ చర్చలు ఉన్నాయి. కంటోన్మెంట్ బోర్డుల్లో ఉద్యోగులుగా ఉండి కంటోన్మెంట్లలో దశాబ్దాలుగా నివసిస్తున్న వారికీ ఓటు హక్కు లేదు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగానికి అనుకూలంగా కంటోన్మెంట్ ఎన్నికల నిబంధనలను సవరించాలి. మొత్తం యువతకు ఓటు హక్కు కల్పించిన తర్వాతే కంటోన్మెంట్ బోర్డులకు ఎన్నికలు నిర్వహిం చాలని కేంద్రప్రభుత్వానికి భారత కమ్యూనిస్టు పార్టీ సూచిస్తోందని తీర్మానం పేర్కొంది.

చీరలే అడ్డుగా వ్యక్తిగత మరుగుదొడ్లు

- ఆర్థిక స్థోమత లేక నిర్మించుకోలేని దుస్థితి
- గిరిజన గ్రామాల్లో దయనీయ పరిస్థితులు

విశాలాంధ్ర-చింతపల్లి:
చీరలే అడ్డుగా మాకు వ్యక్తిగత మరుగుదొడ్లు అయ్యాయని గిరిజన మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవడానికి తమకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో తాము ధరించే చీరలనే కర్రలతో మడిగా అడ్డుగా చుట్టి వ్యక్తిగత మరుగుదొడ్లుగా వినియోగించుకుంటున్నామని అనేక గ్రామాలలో గిరి మహిళలు అంటున్నారు. ఇది గిరిజన ప్రాంతాల ప్రజల దయనీయ పరిస్థితులను ఎత్తి చూపుతోంది. అల్లూరి జిల్లా చింతపల్లి మండలంలోని చౌడుపల్లి పంచాయతీ పరిధిలోని గర్లి గెడ్డ గ్రామంలో సుమారు 30 కుటుంబాలు నివసిస్తుండగా కేవలం 10 కుటుంబాల వారే అంతంతమాత్రంగా నిర్మించుకున్నారు. మిగిలిన వారు పూర్తిగా మరుగుదొడ్లు నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేక చీరలను చుట్టూ మడిగా కట్టి మరుగుదొడ్లుగా ఏర్పాటు చేసుకుని మహిళలు స్నానాలు, వ్యక్తిగత అవసరాలు తీర్చుకుంటున్నారు. ప్రపంచం సాంకేతికంగా దూసుకుపోతున్న తరుణంలో వ్యక్తిగత మరుగుదొడ్లను మహిళలు చీరలతో కట్టుకొని అవసరాలు తీర్చుకోవడం ప్రపంచం తలదించుకునేలా ఉంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ప్రతి గిరి గ్రామంలో సర్వే నిర్వహించి ప్రతి కుటుంబానికి వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజును గెలిపించండి

ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న పిలుపు

విశాలాంధ్ర-కడప బ్యూరో:
రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పశ్చిమ రాయలసీమ శాసనమండలి ఉపాధ్యాయ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల అభ్యర్థి పోతుల నాగరాజును అధిక మెజారిటీతో గెలిపించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న పిలుపునిచ్చారు. బుధవారం యూటీఎఫ్ కార్యాలయంలో ఎన్నికల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. వారి న్యాయమైన కోరికలను పరిష్కరించకుండా భయభ్రాంతులకు గురిచేస్తోందన్నారు. పాఠశాలల విలీనం పేరుతో విద్యా వ్యవస్థను ధ్వంసం చేసిందని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి ఇంకా మిగులు ఉపాధ్యాయులను చూపించటం దుర్మార్గమన్నారు. యేటా జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి నిరుద్యోగులను నట్టేట ముంచిందన్నారు. లెక్చరర్, ఉపాధ్యాయ పోస్టులు, ఏపీపీఎస్సీ గ్రూప్ 1,2,3,4 ఇంజనీరింగ్ ఇతర శాఖలలో అనేక ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని వాటిని వెంటనే భర్తీ చేయాలన్నారు. గతంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికై ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం, విద్యాభివృద్ధి కోసం అనేక పోరాటాలు చేసి, చట్టసభల్లో సమస్యలను ఏకరువు పెట్టిన కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా సామాజిక పోరాటాలలో క్రియాశీలక పాత్ర పోషించి నిరుద్యోగుల పక్షాన నిలబడి... ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం, రాయలసీమ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న పోతుల నాగరాజును గెలిపించి శాసనమండలికి పంపించాలని తిమ్మన్న అన్నారు. అధికార పార్టీకి అత్యధిక శాసనసభలో, శాసనమండలిలో అత్యధిక మెజార్టీ ఉండటంతో ఇష్టానుసారం ప్రజాస్వామ్యాన్ని ఖూనిచేస్తూ ఉద్యోగులపై కక్ష కట్టారన్నారు. ప్రశ్నించే గొంతులను అణచివేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల పక్షాన నిలబడి మాట్లాడే పట్టభద్రుల అభ్యర్థి పోతుల నాగరాజు, ఉపాధ్యాయ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డికి అండగా నిలిచి వారిని గెలిపించి చట్టసభలకు పంపించాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జాన్సన్‌బాబు, శివారెడ్డి, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా, ఎస్‌టీయు జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, యూటీఎఫ్ విజయ్‌కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్.నాగసుబ్బారెడ్డి, పులి కృష్ణమూర్తి, ఎంవి సుబ్బారెడ్డి, పి.చంద్రశేఖర్, వీరశేఖర్, సుబ్బరాయుడు, వెంకటశివ, సిబాదుల్లా, విజయలక్ష్మి, సుబ్రహ్మణ్యం, శ్రీరాములు, జిల్లా సమితి సభ్యులు వెంకట్రాయుడు, జకరయ్య, మద్దిలేటి, కొమ్మద్ది ఈశ్వరయ్య, పి.మస్తాన్, షరీఫ్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.దస్తగిరి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పవన్ కుమార్ పాల్గొన్నారు.

తొలిరోజు ఆసీస్‌దే ఆధిపత్యం

- 109 పరుగులకే కుప్పకూలిన టీమిండియా
- 47 పరుగుల ఆధిక్యం సాధించిన ఆస్ట్రేలియా

ఇండోర్:
బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా టీమిండియాతో జరుగుతున్న మూడో టెస్టులో తొలి రోజు ఆస్ట్రేలియా ఆధిపత్యం సాగింది. ఒకటిన్నర సెషన్లలోనే టీమిండియాను ఆలౌట్ చేసిన ఆస్ట్రేలియా... ఆ తర్వాత రెండు సెషన్లలో బ్యాటుతోనూ ఆధిపత్యాన్ని చూపించింది. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 54 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 156 పరుగులు చేసింది ఆస్ట్రేలియా. ఫలితంగా ఇప్పటికే 47 పరుగుల ఆధిక్యం సంపాదించింది. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా (60) రాణించాడు. టాప్ ఆర్డర్ బ్యాటర్‌లు మార్నస్ లబుషగ్నే (31), స్టీవ్ స్మిత్ (26) కూడా పర్వాలేదనిపించారు. మరో ఓపెనర్ ట్రావిస్ హెడ్ (9) విఫలమయ్యాడు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా జోరు కొనసాగుతోంది. రెండో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో ఏకంగా ఏడు వికెట్లు తీసిన జడేజా... మూడో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. అంతకుముందు టీమిండియా బ్యాటర్లు ఆసీస్ స్పిన్నర్లకు దాసోహం అన్నట్లుగా వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టారు. విరాట్ కోహ్లీ (22), శుభ్‌మన్ గిల్ (21), ఉమేశ్ యాదవ్ (17) శ్రీకర్ భరత్ (17), అక్షర్ పటేల్ (12), రోహిత్ శర్మ (12) మాత్రమే రెండంకెల స్కోరు చేయగలిగారు. మిగిలినవారంతా ఒక అంకె స్కోరుకే పరిమితమయ్యారు. దాంతో టీమిండియా 109 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఆసీస్ బౌలర్లలో మాథ్యూ కుహ్నెమాన్ 5, నాథన్ లియాన్ 3 వికెట్లు తీశారు. టాడ్ మర్ఫీకి ఒక వికెట్ దక్కింది. టీమిండియాను కేవలం 33.2 ఓవర్లలోనే ఆలౌట్ చేసినప్పటికీ ఆసీస్‌కి శుభారంభం దక్కలేదు. ఇన్నింగ్స్ రెండో ఓవర్‌లో ట్రావిస్ హెడ్‌ని జడేజా ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేశాడు. అంపైర్ నాటౌట్‌గా ప్రకటించినా డీఆర్ఎస్ తీసుకున్న టీమిండియాకి ఫలితం దక్కింది. ఆ తర్వాతి ఓవర్‌లో మార్నస్ లబుషేన్‌ని జడేజా క్లీన్ బౌల్డ్ చేసినప్పటికీ అది నో బాల్‌గా తేలడంతో లబుషేన్ నాటౌట్‌గా తేలాడు. ఆ తర్వాత ఉస్మాన్ ఖవాజా కోసం రెండు సార్లు రివ్యూ తీసుకుని, ఫలితం రాబట్టలేకపోయింది టీమిండియా. రెండు డీఆర్ఎస్ రివ్యూలు వృథా కావడంతో ఆ తర్వాత టీమిండియా జాగ్రత్త పడింది. ఇది ఆస్ట్రేలియాకి కలిసి వచ్చింది. లబుషేన్ 7 పరుగుల వద్ద ఉన్నప్పుడు అశ్విన్ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూకి అప్పీలు చేయగా, అంపైర్ నాటౌట్‌గా ప్రకటించాడు. ఒకే రివ్యూ మిగలడంతో కెప్టెన్ రోహిత్ డీఆర్ఎస్ తీసుకోలేదు. అయితే టీవీ రీప్లేలో బంతి వికెట్లను తాకుతుందని స్పష్టంగా కనిపించింది. 102 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న ఉస్మాన్ ఖవాజాతో కలిసి లబుషేన్ రెండో వికెట్‌కి 96 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. అదృష్టం కలిసి రావడంతో మూడు సార్లు అవుటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్న లబుషేన్ (31) రవీంద్ర జడేజా బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. 147 బంతుల్లో 4 ఫోర్లతో 60 పరుగులు చేసిన ఉస్మాన్ ఖవాజా కూడా రవీంద్ర జడేజా బౌలింగ్‌లో శుబ్‌మన్ గిల్‌కి క్యాచ్ ఇచ్చి అవుట్ అయ్యాడు. 38 బంతుల్లో 4 ఫోర్లతో 26 పరుగులు చేసిన స్టీవ్ స్మిత్ కూడా జడేజా బౌలింగ్‌లోనే అవుట్ అయ్యాడు. ఆస్ట్రేలియా కోల్పోయిన 4 వికెట్లను రవీంద్ర జడేజానే పడగొట్టడం విశేషం. అయితే ట్రావిస్ హెడ్‌ని అంపైర్ నాటౌట్‌గా ప్రకటించినా డీఆర్ఎస్ తీసుకుని వికెట్ సాధించిన రవీంద్ర జడేజా, ఆ తర్వాత లబుషేన్ కోసం రెండు సార్లు, స్మిత్ కోసం ఓసారి డీఆర్ఎస్ రివ్యూలు తీసుకుని వాటిని వృథా చేశాడు. తొలి 40 ఓవర్లలో 3 డీఆర్ఎస్ రివ్యూలను కోల్పోయింది టీమిండియా.

ఒంటరిగా పోటీ చేసే దమ్ముందా?

చంద్రబాబుకు కాకాణి గోవర్ధనరెడ్డి సవాల్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
టీడీపీ అధినేత చంద్రబాబుకు రాబోయే ఎన్నికల్లో 175 స్థానాలకు ఒంటరిగా పోటీచేసే దమ్ముందా? అని రాష్ట్ర మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి సవాల్ విసిరారు. ఏపీ సచివాలయం ప్రచార విభాగం దగ్గర బుధవారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. వైసీపీ రైతు భరోసా-పీఎం కిసాన్ పథకం కింద ఇప్పటివరకు రూ.27,062 కోట్లను నేరుగా రైతుల ఖాతాలలో జమచేశామన్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో జరిగిన పంట నష్టాన్ని ఆ సీజన్ ముగిసేలోపు చెల్లించామని చెప్పారు. 2019 నుంచి ఇప్పటి వరకూ రూ.1,911.78కోట్ల మేర ఇన్‌పుట్ సబ్సిడీ రైతులకు ఇచ్చామన్నారు. వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ పథకం కింద అర్హులైన ప్రతి రైతుకు ఏటా రూ.13,500 రైతు భరోసా సాయాన్ని విడతల వారీగా అందజేస్తున్నామన్నారు. ఏ రాష్ట్ర ప్రభుత్వ బడ్జెటైనా కేంద్ర ప్రభుత్వం అందజేసే నిధులను కలుపుకుని బడ్జెట్ అంచనాలను రూపొందిస్తుందని తెలిపారు. గతేడాది మాండస్ తుపాను వల్ల పంట నష్టపోయిన 91,237 మంది రైతులకు రబీ సీజన్ ముగిసే లోపు పెట్టుబడి సాయంగా రూ.76.99 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని అందించామని చెప్పారు.

కాంగ్రెస్ ఆదేశిస్తే విజయవాడ నుంచి పోటీ

కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
కాంగ్రెస్ అధిష్టానం ఆదేశిస్తే వచ్చే ఎన్నికల్లో విజయవాడ పార్లమెంటు నుంచైనా పోటీ చేస్తానని కేంద్ర మాజీమంత్రి రేణుకా చౌదరి అన్నారు. విజయవాడ నగరంలో ఒక ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన ఆమె మీడియాతో కొద్దిసేపు ముచ్చటించారు. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న రాజశేఖర్ రెడ్డికి ఆయన సంతానం మూలంగా సుఖం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజశేఖర్‌రెడ్డికి ఆత్మశాంతి లేకుండా జగన్ పిచ్చివేషాలు వేస్తున్నారని మండిపడ్డారు. జగన్ అప్పుడు కూడా పిచ్చి వేషాలు వేసే వారని.. అయితే తండ్రిగా రాజశేఖర్ రెడ్డి బయటకు రాకుండా కాపాడినట్లు తెలిపారు. ఏపీ ప్రజల పరిస్థితి చూస్తే జాలిపడాలో, ఆక్రోషం తెచ్చుకోవాలో అర్థం కావడం లేదన్నారు. బంగారం లాంటి రాష్ట్రం పతనం అయిపోతోందని ఆవేదన వెలిబుచ్చారు. సుప్రీంకోర్టు తీర్పులను కూడా సీఎం లెక్కచేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నందమూరి తారకరామారావు కూడా రాజశేఖర్ రెడ్డిని గౌరవించేవారని... వారిరువురికి ఒకరిపై ఒకరికి గౌరవం ఉందని తెలిపారు. వారికి ఆత్మశాంతి లేకుండా జగన్ పేర్లు మారుస్తున్నారని హెల్త్ యూనివర్శిటీ పేరు మార్పునుద్దేశిస్తూ వ్యాఖ్యానించారు. రాజశేఖర రెడ్డి పేరు పెట్టకపోతే ఆయన తరుగుతారనుకుంటే పొరపాటే అన్నారు. నీకు చేతనైతే ఒక యూనివర్సిటీని తీసుకురా.. నీపేరో, తాతపేరో పెట్టుకో అంటూ హితవు పలికారు. అమరావతి రైతులను ఎంత ఇబ్బందిపెడితే వారి ఉద్యమం అంతకంటే ఎక్కువగా బలపడుతుందన్నారు. ఈ ఉద్యమం ద్వారా రైతు గౌరవం మరింత పెరిగిందన్నారు. వ్యవసాయం చేసే ప్రతి ఒక్కరూ రైతులేనని, వారికి కులం లేదని అన్నారు. ఏ క్షణంలో రాజధాని రైతులు పిలిచినా తాను వస్తానని స్పష్టం చేశారు. కోర్టు తీర్పులను సైతం పట్టించుకోని ముఖ్యమంత్రిపై సుప్రీంకోర్టు చర్యలు తీసుకోవాలని లేకపోతే ప్రజలే సహాయనిరాకరణ చేస్తారని హెచ్చరించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.